www.vishalabharati.com
epaper.vishalabharati.com

శనివారం, హైదరాబాద్
29 ఆగస్టు 2026
సంపుటి:4 సంచిక: 233

# విశాల భారతి

తెలుగు దినపత్రిక




## లక్కీడ్రాతో సొంతిల్లు

- ఇందిరమ్మ టవర్స్‌లో లక్కీడ్రా ద్వారా ఫ్లాట్ల కేటాయింపు
- 16 నియోజకవర్గాల్లో 8 వేల ఫ్లాట్లకు డ్రా
- 525 చదరపు అడుగుల డబుల్ బెడ్‌రూమ్ తరహా ఫ్లాట్
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులకు ప్రత్యేక రిజర్వేషన్లు
- మహిళలకు 30 శాతం రిజర్వేషన్.. ఉచిత రిజిస్ట్రేషన్

02

## హట్టి గోల్డ్ మైన్స్‌లో డిప్యూటీ సీఎం
# భట్టి పర్యటన



- బంగారం ఉత్పత్తి, శుద్ధి ప్రక్రియల పరిశీలన
- దేవదుర్గ గోల్డ్–కాపర్ బ్లాక్‌పై ప్రత్యేక దృష్టి
- సింగరేణి అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి

**రాయచూర్: (ప్రభంజనం ):**

తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క కర్ణాటకలోని రాయచూర్ జిల్లాలో ఉన్న హట్టి గోల్డ్ మైన్స్ ను శుక్రవారం సందర్శించారు. దేశంలో ప్రభుత్వ రంగంలో బంగారం ఉత్పత్తి చేస్తున్న సంస్థగా పేరున్న హట్టి గోల్డ్ మైన్స్‌లో గనుల నిర్వహణ, ఖనిజం వెలికితీత, బంగారం శుద్ధి,

మిగతా 2లో..



# రాఖీతో రాజీ.. అంత ఈజీ కాదు!

- కొండా సురేఖ రాఖీ భేటీకి రాజకీయ ప్రాధాన్యం
- రేవంత్–సురేఖ మధ్య విభేదాలపై చర్చ
- రాఖీ వేడుకతో డ్యామేజ్ కంట్రోల్ సంకేతం
- ఫోటోలకు మించిన అసలు రాజకీయ సమీకరణాలు
- సురేఖపై క్రమశిక్షణ చర్యలపై ఉత్కంఠ
- తదుపరి అడుగులపైనే అందరి ఫోకస్



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ రాజకీయాల్లో పండుగ వేడుకలు కేవలం సంప్రదాయాలకే పరిమితం కావు, వాటి వెనుక పక్కా రాజకీయ వ్యూహాలు దాగి ఉంటాయి. సీఎం రేవంత్ రెడ్డికి మంత్రి కొండా సురేఖ రాఖీ కట్టిన దృశ్యం ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతోంది. సాధారణ రోజుల్లో అయితే ఇది రెగ్యులర్ న్యూస్ మాత్రమే. కానీ ఇటీవల కొండా ఫ్యామిలీ చేసిన ఘాటు వ్యాఖ్యలు, అధిష్టానం వద్ద నడిచిన

మిగతా 3లో..



## నీళ్ల విషయంలో నో కాంప్రమైజ్

- జల వివాదాలపై సీఎం రేవంత్ కీలక ఆదేశాలు
- తెలంగాణ ప్రయోజనాలపై రాజీ వద్దు
- తుమ్మిడిహట్టి భేటీపై ప్రత్యేక దృష్టి
- కేఆర్ఎంబీ నిర్ణయాలపై సీఎం సమీక్ష
- 112 టీఎంసీల నీటికి తెలంగాణ డిమాండ్
- ఏపీ 47 టీఎంసీల ప్రతిపాదనపై అభ్యంతరం

03



## చిన్నారులతో మోదీ సరదా ముచ్చట్లు

చిన్నప్పుడు ఏ కలలు కనేవారు? అని అడిగిన పిల్లలు

02

## విశ్వనగరాన్ని విషాద నగరంగా మార్చారు

- హైదరాబాద్‌ను విషాద నగరంగా మార్చారు
- రోడ్లు, డ్రైనేజీపై కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు
- మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ గెలుపుపై ధీమా
- అవినీతి రహిత పాలన అందిస్తామని హామీ
- మహిళా సాధికారతకు మోదీ ప్రభుత్వం ప్రాధాన్యం
- నేపాల్ వరదల్లో భారతీయుల పరిస్థితిపై ఆందోళన

03





## కేసీఆర్‌కు రాఖీ కట్టిన బీఆర్ఎస్ మహిళా నేతలు

**సిటీ బ్యూరో: ( ప్రభంజనం )**

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావుకు పార్టీ మహిళా నేతలు.. మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ తుల ఉమ రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పార్టీ అధినేత వారిద్దరినీ ఆత్మీయంగా పలకరించి ఆశీర్వదించి వారికి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# రాఖీ పండుగ.. ఆర్టీసీ ఛార్జీల బాదుడు

- రాఖీకి టీజీఎస్ఆర్టీసీ 5,000 ప్రత్యేక బస్సులు
- స్పెషల్ బస్సుల పేరుతో టికెట్ ధరల పెంపు
- హైదరాబాద్–కరీంనగర్ రూట్‌లో రూ.100–150 అదనపు భారం
- కన్సెషన్లు, పాసులు వర్తించడంపై ప్రయాణికుల ఆందోళన
- ఛార్జీల పెంపుపై ఆర్టీసీపై తీవ్ర విమర్శలు
- పండుగ వేళ రెగ్యులర్ ఛార్జీలతోనే బస్సులు నడపాలని డిమాండ్




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** రాఖీ పండుగ సీజన్ మొదలైందంటే చాలు నగరాల్లో జాబ్స్, స్టడీస్ కోసం ఉండే యూత్ మొత్తం తమ సొంత ఊళ్లకు వెళ్లడానికి ఫుల్ ప్లాన్స్ రెడీ చేసుకుంటారు. తోబుట్టువులను కలిసి సెలబ్రేట్ చేసుకోవాలనే ఆత్రుత ప్రతి ఒక్కరిలోనూ క్లియర్ గా కనిపిస్తుంది. ఇలాంటి క్రూషియల్ టైంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని టీజీఎస్ఆర్టీసీ ఏకంగా ఐదు వేల ప్రత్యేక బస్సులను రోడ్డెక్కిస్తున్నట్లు అనౌన్స్ చేసింది. వినడానికి ఇది చాలా సూపర్ రిలీఫ్ ఇచ్చే న్యూస్ లా అనిపించినా, గ్రౌండ్ లెవెల్

మిగతా 4లో..

## ఆర్ఆర్ఆర్ ఎందుకు ఆగింది?

- హైదరాబాద్ చుట్టూ 347 కి.మీ. ఆర్ఆర్ఆర్ నిర్మాణం
- ఉత్తర భాగం 161.5 కి.మీ. ఆరు లేన్ల ఎక్స్‌ప్రెస్‌వే
- సంగారెడ్డి నుంచి చౌటుప్పల్ వరకు కీలక అనుసంధానం
- రూ.23,935 కోట్లకు కేంద్రం నిధుల కేటాయింపు
- ఎన్‌హెచ్-161AAగా జాతీయ రహదారి గుర్తింపు
- టెండర్ల గడువు పదేపదే పొడిగింపు.. పనులు ఎప్పుడనే ప్రశ్న

02







## కరీంనగర్ సుడా పీఠం దక్కేదెవరికి ?

- సుడా చైర్మన్ పీఠంపై కాంగ్రెస్‌లో హోరాహోరీ పోటీ
- కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి పదవీకాలం ముగియడంతో కొత్త రేసు
- సీనియర్లతో పాటు బీసీ, మైనార్టీ నేతల లాబీయింగ్
- ముగ్గురు మంత్రుల ఏకాభిప్రాయమే కీలకం
- సామాజిక సమీకరణాలపై కాంగ్రెస్ అధిష్టానం ఫోకస్
- రాబోయే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సుడా పదవికి ప్రాధాన్యం

03

## తెలంగాణలో ఉన్నది ప్రజా ప్రభుత్వమా?

- పోలీసు దౌర్జన్యాలపై హరీష్ రావు తీవ్ర ఆగ్రహం
- సీఎం రేవంత్, డీజీపీని సూటిగా ప్రశ్నించిన హరీష్ రావు
- మహబూబాబాద్, తిమ్మాజిపేట ఘటనలపై తీవ్ర దుమారం
- కోదాడలో చిరువ్యాపారులపై పోలీసుల దురుసు వైఖరి
- పేదలు, బలహీన వర్గాలపైనే ప్రతాపమా? ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఫైర్
- పోలీసు అధికారులపై ఉన్నతస్థాయి విచారణకు డిమాండ్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు ప్రజాస్వామ్య వ్యవస్థను తీవ్రంగా ప్రశ్నించేలా చేస్తున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ప్రజాపాలన అని చెప్పుకుంటున్న పాలకులు, క్షేత్రస్థాయిలో అసలైన స్వేచ్ఛను కాలరాస్తున్నారని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత కొద్ది రోజులుగా వరుసగా చోటుచేసుకుంటున్న విపరీతమైన పోలీస్ దౌర్జన్యాలు ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నాయి. సోషల్ మీడియా వేదికగా ఆయన సీఎం రేవంత్ రెడ్డి, డీజీపీని సూటిగా ప్రశ్నిస్తూ, అసలు

మిగతా 3లో..





# నేపాల్‌లో మృత్యు మేఘాలు!

- నేపాల్ వరదల్లో 549 మంది మృతి
- మరోసారి భోటేకోషి వరద ముప్పు
- 977 మంది గల్లంతు1,545 మంది రక్షణ
- రెస్క్యూలో 7,451 మంది భద్రతా సిబ్బంది
- సరిహద్దులో 2 మిలియన్ క్యూబిక్ మీటర్ల సరస్సు
- ఆగస్టు 29 నుంచి పరీక్షలు వాయిదా

02

నేపాల్‌లో ఇటీవల సంభవించిన భయంకరమైన ఆకస్మిక వరదలు దేశాన్ని అతలాకుతలం చేశాయి. ప్రాణనష్టం భారీ స్థాయిలో పెరిగి, ఇప్పటివరకు సుమారు 549 మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం. సహాయక , రెస్క్యూ చర్యలు మూడో రోజు కూడా నిరంతరంగా కొనసాగుతున్నాయి. మరోవైపు, భోటేకోషి నదీ పరివాహక ప్రాంతంలో మళ్లీ కొత్తగా వరద ముప్పు పొంచి ఉందంటూ అధికారులు అత్యవసర హెచ్చరికలు జారీ చేశారు. ఈ వారంలో తొలుత భారీ విపత్తు సంభవించిన ప్రాంతంలో నీటి మట్టాలు మళ్లీ ప్రమాదకరంగా పెరుగుతుండటంతో ప్రజల్లో తీవ్ర భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# చిన్నారులతో మోదీ సరదా ముచ్చట్లు

**న్యూఢిల్లీ:**

రాఖీ పండుగ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ స్కూల్ పిల్లలతో కాసేపు సరదాగా గడిపారు. ఢిల్లీలోని 7 లోక్ కళ్యాణ్ మార్గ్‌లోని తన అధికారిక నివాసంలో చిన్నారులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా పిల్లలు అడిగిన ప్రశ్నలకు ప్రధాని మోదీ ఉత్సాహంగా, సరదాగా సమాధానాలు ఇచ్చారు. చిన్నతనంలో మీరు ఎలాంటి కలలు కనేవారు? అని పిల్లలు మోదీని ప్రశ్నించారు. అందుకు ఆయన నవ్వుతూ.. మీ అందరినీ కలవాలని కలలు కనేవాడిని అంటూ సరదాగా సమాధానం ఇచ్చారు. అనంతరం చిన్నారులతో షేక్‌హ్యాండ్ ఇచ్చి, హైఫైవ్ చేస్తూ వారిని ఉత్సాహపరిచారు. పిల్లలను ఆశీర్వదించారు. చిన్నారులతో జరిగిన ఈ సరదా సంభాషణకు సంబంధించిన వీడియోను ప్రధాని మోదీ సోషల్ మీడియాలో పంచుకున్నారు. రక్షాబంధన్ సందర్భంగా దేశ ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమ, ఆప్యాయత, నమ్మకానికి ప్రతీకగా రాఖీ పండుగ నిలుస్తుందని పేర్కొన్నారు. రక్షాబంధన్ ప్రతి ఒక్కరి జీవితంలో సంతోషం, సౌభాగ్యం, విజయం తీసుకురావాలని ప్రధాని మోదీ ఆకాంక్షించారు.



# హట్టి గోల్డ్ మైన్స్‌లో డిప్యూటీ సీఎం భట్టి పర్యటన

**మొదటిపేజీ తరువాయి**

ఉత్పత్తి ప్రక్రియలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పర్యటనలో భాగంగా భట్టి విక్రమార్క అండర్‌గ్రౌండ్ మైన్, యూటీ ఓపెన్‌కాస్ట్ గోల్డ్ మైన్లను పరిశీలించారు. అనంతరం ప్రొడక్షన్ యూనిట్, బంగారం శుద్ధి కేంద్రం, ఎలక్ట్రోవిన్నింగ్ కేంద్రాల పనితీరును అధికారులు ఆయనకు వివరించారు. బంగారం కలిగిన ఖనిజం నుంచి తుది ఉత్పత్తి వరకు జరిగే ప్రక్రియపై ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు.



**రోజుకు 2 నుంచి 4 కిలోల బంగారం ఉత్పత్తి**

హట్టి గోల్డ్ మైన్స్‌లో ప్రస్తుతం రోజుకు సగటున 2 నుంచి 4 కిలోల వరకు బంగారం ఉత్పత్తి జరుగుతున్నట్లు మైన్స్ అధికారులు భట్టి విక్రమార్కకు వివరించారు. గనుల నుంచి ఖనిజాన్ని వెలికితీసి, దానిని ప్రాసెస్ చేసి, శుద్ధి కేంద్రాల ద్వారా బంగారాన్ని పొందే విధానాన్ని అధికారులు వివరించారు. తెలంగాణకు చెందిన సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్ సీసీఎల్ ) బొగ్గు ఉత్పత్తికి మాత్రమే పరిమితం కాకుండా ఇతర విలువైన ఖనిజాల అన్వేషణ, ఉత్పత్తి రంగాల్లోకి విస్తరించే దిశగా అడుగులు వేస్తోంది. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన వాణిజ్య వేలంలో సింగరేణి సంస్థ కర్ణాటకలోని దేవదుర్గ బంగారం-రాగి ఖనిజ అన్వేషణ బ్లాక్ హక్కులను దక్కించుకుంది. ఈ బ్లాక్ హట్టి గోల్డ్ మైన్స్‌కు సమీపంలోనే ఉండటంతో, అక్కడి సుదీర్ఘ మైనింగ్ అనుభవం, సాంకేతిక పరిజ్ఞానం సింగరేణికి ఉపయోగపడుతుందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.


**బొగ్గు నుంచి బంగారం, రాగి వైపు సింగరేణి అడుగులు**

సింగరేణిని కేవలం బొగ్గు ఉత్పత్తి సంస్థగా కాకుండా బంగారం, రాగి వంటి కీలక ఖనిజాల అన్వేషణ, ఉత్పత్తి రంగాల్లోనూ విస్తరించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనకు ఈ పర్యటన అనుసంధానంగా కనిపిస్తోంది. కొత్త ఖనిజ ప్రాజెక్టుల ద్వారా సంస్థ కార్యకలాపాలు విస్తరించడంతో పాటు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని భట్టి విక్రమార్క అభిప్రాయపడ్డారు. హట్టి గోల్డ్ మైన్స్‌లో అనుసరిస్తున్న మైనింగ్ పద్ధతులు, ఖనిజ శుద్ధి సాంకేతికత, ఉత్పత్తి నిర్వహణ వంటి అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించడం ద్వారా దేవదుర్గ ప్రాజెక్టుకు అవసరమైన అనుభవాన్ని సింగరేణి ఉపయోగించుకునే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ.. హట్టి గోల్డ్ మైన్స్ పర్యటన ద్వారా బంగారం ఉత్పత్తి రంగంలోని ప్రస్తుత విధానాలను అధ్యయనం చేయడంతో పాటు, సింగరేణి చేపట్టనున్న దేవదుర్గ గోల్డ్-కాపర్ అన్వేషణకు అవసరమైన సాంకేతిక, నిర్వహణ అనుభవాన్ని అర్థం చేసుకోవడమే ప్రధాన ఉద్దేశం అన్నారు. భవిష్యత్తులో సింగరేణి కార్యకలాపాలను బొగ్గు రంగాన్ని దాటి ఇతర కీలక ఖనిజాల వైపు విస్తరించడం ద్వారా సంస్థ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు తెలంగాణకు కొత్త పారిశ్రామిక, ఉపాధి అవకాశాలను సృష్టించాలన్నది ప్రభుత్వ లక్ష్యం అన్నారు. భట్టి విక్రమార్క పర్యటనలో సింగరేణి సీఎండీ బుద్ధ ప్రకాష్ జ్యోతి, ప్లానింగ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, జీఎం పంకజ్ కులశ్రేష్ఠతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఆర్ఆర్ఆర్ ఎందుకు ఆగింది?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్ చుట్టూ మరో భారీ రింగ్ రోడ్డు నిర్మాణానికి రంగం సిద్ధమైంది, అనుమతులు కూడా వచ్చాయి, జాతీయ రహదారి నంబర్ కేటాయించారు. వేల కోట్ల నిధులు కూడా సిద్ధంగా ఉన్నాయి. అయితే, ఒకే ఒక్క దశలో ప్రాజెక్టు మళ్లీ మళ్లీ ఆగిపోతోంది. అదే టెండర్ల ప్రక్రియ. టెండర్లు పిలిచారు. బిడ్లు దాఖలు చేయడానికి గడువు ఇచ్చారు. కానీ బిడ్లను తెరవకముందే గడువును మళ్లీ మళ్లీ పొడిగిస్తున్నారు. అసలు హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగం ఎక్కడి నుంచి ఎక్కడి వరకు వస్తుంది. ఎన్ని జిల్లాలు, మండలాలు, గ్రామాలకు ప్రయోజనం కలుగుతుంది? నిధులు సిద్ధంగా ఉన్నా, పనులు ఎందుకు మొదలు కావడం లేదు? హైదరాబాద్ అభివృద్ధి దిశను మార్చే భారీ ప్రాజెక్టు. నగరంపై ట్రాఫిక్ భారాన్ని తగ్గించే మరో వలయాకార రహదారి. పరిశ్రమలు, లాజిస్టిక్స్, కొత్త టౌన్‌షిప్‌లు, పెట్టుబడులకు కొత్త దారులు తెరిచే మెగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టు. అదే హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు.. ఆర్.ఆర్.ఆర్. హైదరాబాద్ చుట్టూ సుమారు 347 కిలోమీటర్ల మేర ఈ భారీ రింగ్ రోడ్డు నిర్మించనున్నారు. ప్రస్తుతం ఉన్న ఔటర్ రింగ్ రోడ్డు, ఓఆర్ఆర్‌కు సుమారు 30 నుంచి 50 కిలోమీటర్ల దూరంలో ఈ కొత్త రింగ్ రోడ్డు నిర్మాణం జరగనుంది. ఈ ప్రాజెక్టును ప్రధానంగా రెండు భాగాలుగా విభజించారు. ఒకటి ఉత్తర భాగం. మరొకటి దక్షిణ భాగం. ముందుగా ఉత్తర భాగం గురించి చూస్తే, సంగారెడ్డి జిల్లాలోని గిర్మాపూర్ నుంచి ప్రారంభమై, యాదాద్రి భువనగిరి జిల్లాలోని తంగడ్‌పల్లి వరకు సుమారు 161.518 కిలోమీటర్ల మేర ఆరు వరసల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మించనున్నారు. విస్తృతంగా చూస్తే, సంగారెడ్డి, నర్సాపూర్, తూప్రాన్, గజ్వేల్, ప్రజ్ఞాపూర్, జగదేవ్‌పూర్, భువనగిరి, యాదగిరిగుట్ట ప్రాంతాల మీదుగా ఈ మార్గం చౌటుప్పల్ వైపు చేరుతుంది. ఈ రహదారి అనేక ప్రధాన జాతీయ రహదారులను అనుసంధానించే కీలక కారిడార్‌గా మారనుంది. ఉత్తర భాగానికి ఇప్పటికే దాదాపు అన్ని కీలక అనుమతులు వచ్చాయి. ఈ రహదారికి ఎన్‌హెచ్ 161AA నంబర్ కూడా కేటాయించారు. ప్రాజెక్టు కోసం కేంద్రం మొత్తం సుమారు




రూ.23,935 కోట్లు కేటాయించింది. ఇందులో సివిల్ పనుల కోసం సుమారు రూ.9,362 కోట్లను హ్యామ్ పద్ధతిలో చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించారు. అంటే, అనుమతులు ఉన్నాయి. జాతీయ రహదారి గుర్తింపు ఉంది. నిధుల కేటాయింపులు ఉన్నాయి. అయితే, అసలు ప్రశ్న మాత్రం ఒక్కటే. పనులు ఎందుకు ప్రారంభం కావడం లేదు? ఇక్కడే అసలు ట్విస్ట్ మొదలవుతోంది. ఉత్తర భాగం నిర్మాణ పనులను రెండు ప్యాకేజీలుగా విభజించారు. ఈ పనులకు మే 20న టెండర్లు పిలిచారు. మొదట బిడ్లు దాఖలు చేసేందుకు జూలై 6 వరకు గడువు ఇచ్చారు .ఆ తర్వాత, గడువును ఆగస్టు 6 వరకు పొడిగించారు. అక్కడితో ఆగలేదు. మరోసారి ఆగస్టు 20 వరకు గడువు పెంచారు. ఇప్పుడు మరోసారి. బిడ్ల గడువును సెప్టెంబర్ 23 వరకు పొడిగించారు. అంటే, టెండర్లు పిలిచారు. కానీ బిడ్లు ఖరారు కాలేదు. బిడ్లు తెరవాల్సిన దశకు వెళ్లకముందే గడువు మీద గడువు పెరుగుతోంది. "అనుమతులు వచ్చినా, నిధులు సిద్ధంగా ఉన్నా, ఇప్పుడు ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం ప్రయాణం టెండర్ల దగ్గరే ఆగిపోయింది. గడువు పదే పదే పొడిగించడంతో, ఈ భారీ ఎక్స్‌ప్రెస్‌వే పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయన్న ప్రశ్న మరింత కీలకంగా మారుతోంది. "ఇక రీజినల్ రింగ్ రోడ్డు దక్షిణ భాగం గురించి చూస్తే, చౌటుప్పల్ నుంచి ప్రారంభమై ఇబ్రహీంపట్నం, కందుకూర్, ఆమనగల్, షాద్‌నగర్, చేవెళ్ల, శంకర్‌పల్లి ప్రాంతాల మీదుగా తిరిగి సంగారెడ్డి వరకు చేరేలా ఈ మార్గాన్ని ప్రతిపాదించారు. సుమారు 182 కిలోమీటర్ల మేర ఈ దక్షిణ భాగం విస్తరించనుంది. ఈ మార్గం విజయవాడ శ్రీశైలం బెంగళూరు వైపు వెళ్లే ప్రధాన జాతీయ రహదారులకు కీలక అనుసంధానాన్ని కల్పించనుంది. ప్రస్తుతం ఈ మార్గానికి సంబంధించి అలైన్‌మెంట్ ఖరారు కాగా.. తదుపరి దశల ప్రక్రియ కొనసాగుతోంది. మొత్తం రీజినల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టు తెలంగాణలోని సుమారు 8 జిల్లాలు, 20 కీలక పట్టణాలు, 33 మండలాలు, 163 రెవెన్యూ గ్రామాలను అనుసంధానించేలా రూపుదిద్దుకుంటోంది. ఇది కేవలం ఒక రోడ్డు ప్రాజెక్టు మాత్రమే కాదు. హైదరాబాద్ చుట్టూ కొత్త అభివృద్ధి వలయాన్ని సృష్టించే ప్రణాళికగా కూడా భావిస్తున్నారు.రీజినల్ రింగ్ రోడ్డు పూర్తయితే, హైదరాబాద్ నగరంలోకి రాకుండానే భారీ వాహనాలు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లే అవకాశం ఉంటుంది. దీంతో నగర ట్రాఫిక్‌పై కొంత భారం తగ్గే అవకాశం ఉంది. అదే సమయంలో కొత్త పరిశ్రమలు, గిడ్డంగులు, లాజిస్టిక్స్ పార్కులు, పారిశ్రామిక కారిడార్లు, కొత్త నివాస ప్రాంతాల అభివృద్ధికి కూడా ఈ రహదారి ఊతమివ్వొచ్చు. హైదరాబాద్‌కు చుట్టూ మరో అభివృద్ధి వలయం ఏర్పడే అవకాశం ఉందనే అంచనాలు ఉన్నాయి. అయితే, ఇంత భారీ ప్రాజెక్టుకు అనుమతులు వచ్చాయి. నిధులు కేటాయించారు. జాతీయ రహదారి నంబర్ కూడా ఇచ్చారు. కానీ, టెండర్ల ప్రక్రియ మాత్రం ఎందుకు ముందుకు సాగడం లేదు? పదే పదే బిడ్ల గడువు ఎందుకు పెరుగుతోంది? కాంట్రాక్టర్ల నుంచి ఆశించిన స్పందన లేదా? టెండర్లకు సంబంధించిన ఆర్థిక లేదా సాంకేతిక అంశాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా? లేక మరేదైనా కారణంతో ప్రక్రియ ఆలస్యమవుతోందా? ఇవన్నీ ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. హైదరాబాద్ చుట్టూ మరో భారీ అభివృద్ధి వలయం నిర్మించాలన్న కలకు ఆర్ఆర్ఆర్ కీలక ప్రాజెక్టు. ఉత్తర భాగానికి అనుమతులు ఉన్నాయి. నిధులు ఉన్నాయి. ప్లాన్ సిద్ధంగా ఉంది. కానీ, పనులు మాత్రం ఇంకా మొదలుకాలేదు. టెండర్ల గడువు మళ్లీ మళ్లీ పెరుగుతుండటంతో, సంగారెడ్డి నుంచి చౌటుప్పల్ వరకు ఆరు లేన్ల ఎక్స్‌ప్రెస్‌వే ఎప్పుడు నేలమీదకు వస్తుంది? అనేదే ఇప్పుడు తెలంగాణ ప్రజల ముందున్న పెద్ద ప్రశ్న.

# నేపాల్‌లో మృత్యు మేఘాలు!





**విశాలభారతి, అంతర్జాతీయం:**

బుధవారం రసువా, మధ్య నేపాల్‌లోని పలు ప్రాంతాలను ఈ ఆకస్మిక వరదలు ఒక్కసారిగా ముంచెత్తాయి. ఈ ప్రకృతి విపత్తు వందలాది మందిని పొట్టనబెట్టుకోవడమే కాకుండా, వేలాది మందిని నిరాశ్రయులను చేసింది. ఇళ్లు, రహదారులు, భారీ వంతెనలు, జలవిద్యుత్ మౌలిక సదుపాయాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. మళ్లీ వరద పోటెత్తే తీవ్ర ప్రమాదం ఉండటంతో రెస్క్యూ బృందాలు ప్రాణాలను పణంగా పెట్టి అత్యంత జాగ్రత్తలతో సహాయక చర్యలు అందిస్తున్నాయి. నీటి మట్టాలు అసాధారణంగా పెరగడం వల్ల మరోసారి భారీ వరద వచ్చే ముప్పు చాలా ఎక్కువైందని 'నేషనల్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ' స్పష్టం చేసింది. బుధవారం ఆకస్మిక వరదలు వచ్చిన చోటే బురదతో కూడిన నీటి మట్టం మళ్లీ గణనీయంగా పెరిగిందని ఆ సంస్థ పేర్కొంది. ఈ ప్రాంతంలో మరిన్ని పెను వరదలు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించింది. రెస్క్యూ మరియు సహాయక చర్యల్లో పాల్గొంటున్న సిబ్బందితో పాటు, వివిధ కారణాల వల్ల భోటేకోషి, త్రిశూలి ప్రాంతాల్లో ఉంటున్న స్థానిక ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కోరింది. ఏదైనా ప్రమాదం ఎదురైతే క్షణం కూడా ఆలస్యం చేయకుండా తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని విజ్ఞప్తి చేసింది. నేపాల్ పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, దాదాపు ఎనిమిది జిల్లాల నుంచి ఇప్పటివరకు 547 మృతదేహాలను వెలికితీశారు. నవల్పరాసి ఈస్ట్, చిత్వాన్, గోర్ఖా, నువాకోట్, ధాడింగ్, తనహు, నవల్పరాసి వెస్ట్ మరియు రసువా జిల్లాల్లో ప్రాణనష్టం తీవ్రంగా ఉంది. చైనా అధికారులు కూడా తమ సరిహద్దు ప్రాంతంలోని గైరోంగ్ కౌంటీలో ఐదుగురు మరణించినట్లు అధికారికంగా వెల్లడించారు. బుధవారం నాటి భీకర వరదల్లో 86 మంది భద్రతా సిబ్బంది, 518 మంది విదేశీ పర్యాటకులు, 128 మంది నేపాల్ ప్రయాణికులతో సహా కనీసం 977 మంది గల్లంతయ్యారు. ఇప్పటివరకు ప్రభావిత ప్రాంతాల నుంచి గాయపడిన, చిక్కుకుపోయిన సుమారు 1,545 మందిని రక్షించి సురక్షిత ప్రాంతాలకు చేర్చారు. వీరిలో 84 మంది కాఠ్మాండులోని ప్రముఖ ఆసుపత్రుల్లో అత్యవసర చికిత్స పొందుతున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు 121 మంది విదేశీ పర్యాటకులను రక్షించినట్లు నేపాల్ టూరిజం బోర్డు స్పష్టం చేసింది. ఇందులో 85 మంది భారతీయులు, 9 మంది దక్షిణ కొరియన్లు, 16 మంది చైనా పౌరులు ఉన్నారు. ఈ విపత్కర పరిస్థితుల్లో సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్లలో నేపాల్ ఆర్మీకి చెందిన 2,391 మందితో సహా మొత్తం 7,451 మంది భద్రతా సిబ్బంది పాల్గొంటున్నారని పోలీసులు తెలిపారు. మారుమూల ప్రాంతాలకు చేరుకోవడానికి, బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి ఆర్మీ హెలికాప్టర్లను ఉపయోగిస్తున్నారు. గ్రౌండ్ టీమ్‌లు నదీతీరాలు, దిగువ ప్రాంతాల్లో ముమ్మరంగా గాలింపు చర్యలను కొనసాగిస్తున్నాయి. దిగువ ప్రాంతాల్లో మరిన్ని మృతదేహాలు పెద్ద ఎత్తున లభ్యమవుతుండటంతో పలు ప్రాంతాల్లోని ఆసుపత్రుల్లో మార్చురీలు సరిపోవడం లేదని కాఠ్మాండు పోస్ట్ నివేదించింది. రసువా, నువాకోట్ ప్రాంతాల్లో కొట్టుకుపోయిన మృతదేహాలు వరద ఉధృతికి దిగువన ఉన్న చిత్వాన్, తనహున్, నవల్పరాసి, గోర్ఖా వంటి జిల్లాల్లో లభించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ భారీ విపత్తు దృష్ట్యా నేపాల్ ప్రభుత్వం ఆగస్టు 29 నుంచి జరగాల్సిన అన్ని రకాల పరీక్షలను తక్షణమే వాయిదా వేయాలని కీలక నిర్ణయం తీసుకుంది. నేపాల్ ప్రధాని బాలేంద్ర షా మరియు ఆయన మంత్రి వర్గ సభ్యులు తమ ఒక నెల వేతనాన్ని విపత్తు సహాయ నిధికి విరాళంగా ఇవ్వాలని నిర్ణయించారు. ఆకస్మిక వరదలతో సర్వస్వం కోల్పోయి నిరాశ్రయులైన వ్యక్తులు, వ్యాపారాల కోసం ప్రత్యేక నివారణ, రాయితీ రుణాలు, పునరావాస ప్యాకేజీని సిద్ధం చేయాలని ఆర్థిక మంత్రిత్వ శాఖను మంత్రివర్గం ఆదేశించింది. ప్రజలు ఎలాంటి అజాగ్రత్త వహించకుండా ప్రభుత్వ సూచనలను తూచా తప్పకుండా పాటించాలని అధికారులు పదేపదే విజ్ఞప్తి చేస్తున్నారు. నేపాల్‌లోని ఛోచెన్ ఖోలా, పురెపు త్సాంగ్పో నదుల సంగమం వద్ద భారీ 'బ్యారియర్ సరస్సు' ఏర్పడిందని చెబుతూ చైనా గురువారం రాత్రి లెవల్IV అలర్ట్ జారీ చేసింది. ప్రకృతి విపత్తుల కోసం చైనా అత్యవసర స్పందన వ్యవస్థలో నాలుగు స్థాయిలు ఉంటాయి. ఇందులో లెవల్I అత్యధికం కాగా, లెవల్ IV అత్యల్పంగా పరిగణిస్తారు. నేపాల్‌చైనా సరిహద్దు సమీపంలో ఈ కొత్త సరస్సు ఏర్పడటంతో భోటేకోషి నదికి దిగువన తాజా వరద ముప్పు తీవ్రంగా పొంచి ఉందని నేపాల్ జలవనరుల, వాతావరణ శాఖ గురువారం హెచ్చరించింది. ఈ సరస్సులో ఇప్పటికే దాదాపు 2 మిలియన్ క్యూబిక్ మీటర్ల నీరు చేరిందని, రాబోయే మూడు రోజుల్లో మరో 3 మిలియన్ క్యూబిక్ మీటర్ల నీరు చేరే అవకాశం ఉందని చైనా అధికారులు నేపాల్‌కు అధికారికంగా సమాచారం అందించారు. ఇది నది కట్ట తెగిపోయే ప్రమాదాన్ని మరింత పెంచుతోంది. టిబెట్‌లో ఉద్భవించి నేపాల్‌లోకి ప్రవహించే భోటేకోషి నదీ వ్యవస్థలో భాగమైన ఛోచెన్ ఖోలా, పురెపు త్సాంగ్పో నదుల సంగమానికి సమీపంలో ఈ ప్రమాదకర సరస్సు ఏర్పడటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. మరణాల సంఖ్య నిరంతరం పెరుగుతుండటం, వందలాది మంది ఇంకా గల్లంతు కావడం, మరో పెను వరద ముప్పు పొంచి ఉండటంతో నేపాల్ సహాయక చర్యలు పూర్తిగా బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, మృతదేహాలను వెలికితీయడంపైనే పూర్తిగా దృష్టి సారించాయి. సోషల్ మీడియాలో మరియు ప్రస్తుత ట్రెండ్‌లో ఈ విపత్తుపై యువత తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ సహాయక చర్యలకు సోషల్ మీడియా వేదికగా మద్దతు తెలుపుతున్నారు. ప్రభుత్వం కూడా ఎప్పటికప్పుడు బులెటిన్‌లు విడుదల చేస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తోంది. అంతర్జాతీయ సంస్థలు మరియు పక్క దేశాలు కూడా నేపాల్‌కు తమ వంతు సహాయం అందించడానికి ముందుకు వస్తున్నాయి. ఈ కష్టకాలంలో దేశం మొత్తం ఒకేతాటిపై నిలబడి బాధితులకు భరోసా కల్పిస్తోంది. వాతావరణ పరిస్థితులు పూర్తిగా అనుకూలిస్తే తప్ప సహాయక చర్యలు వేగవంతం కావడం కష్టమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రజలు సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు వదంతులను నమ్మవద్దని, కేవలం అధికారిక ప్రకటనలను మాత్రమే నమ్మాలని ప్రభుత్వం మరోసారి స్పష్టం చేసింది.

# లక్కీడ్రాతో సొంతిల్లు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ ప్రభుత్వం పేద ప్రజల సొంతింటి కలను నిజం చేసేందుకు ఇందిరమ్మ టవర్స్ ప్రాజెక్ట్‌ను వేగంగా ముందుకు తీసుకెళ్తోంది. నగరంలో అత్యంత పారదర్శక పద్ధతిలో అర్హులైన నిరుపేదలకు ఫ్లాట్లను కేటాయించడానికి ప్రత్యేకంగా లక్కీడ్రా విధానాన్ని ఎంచుకుంది. కుల, మత, రాజకీయ ప్రభావాలకు తావులేకుండా అర్హత మాత్రమే ప్రామాణికంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారు. ఈ ఎంపిక ప్రక్రియను కేవలం నాలుగు గోడల మధ్య కాకుండా మీడియా, ప్రజల సమక్షంలో లైవ్ టెలికాస్ట్ ద్వారా నిర్వహిస్తున్నారు. నాంపల్లి, కుత్బుల్లాపూర్, సికింద్రాబాద్, రాజేంద్రనగర్ వంటి కీలక నియోజకవర్గాల్లో ఈ లక్కీడ్రాలు ప్రారంభమయ్యాయి. నాంపల్లి రెడ్‌హిల్స్, మైలార్‌దేవుపల్లిలో జరిగిన ఈవెంట్లలో మంత్రులు, అధికారులు స్వయంగా పాల్గొన్నారు. ఈ నెల ముగిసే నాటికి మొత్తం 16 నియోజకవర్గాల్లోని దాదాపు 8 వేల ఫ్లాట్లకు లక్కీడ్రా పూర్తి చేయాలని టార్గెట్ పెట్టుకున్నారు. రోజుకు నాలుగు నియోజకవర్గాల చొప్పున ప్రక్రియ సాగుతోంది. నగరంలో ప్రతి ఒక్కరూ సొంత గూడు కలిగి ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ భారీ ప్రాజెక్టును అమలు చేస్తోంది. దీనివల్ల మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అర్హులకు నేరుగా లబ్ధి చేకూరుతుంది. డిజిటల్ పద్ధతుల్లో రికార్డులను పక్కాగా భద్రపరుస్తూ భవిష్యత్తు తరాలకు స్పష్టమైన వ్యవస్థను నిర్మిస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలో 480 ఫ్లాట్ల కేటాయింపు లక్ష్యంగా ఉండగా, మొత్తం 600 మందిని లక్కీడ్రా ద్వారా షార్ట్‌లిస్ట్ చేస్తున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పూర్తి సమాచారాన్ని సరిచూసిన తర్వాతే తుది జాబితా ఖరారు చేస్తారు. ఒకవేళ ఎంపికైన వారిలో ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా అనర్హులుగా తేలితే, వెయిటింగ్ లిస్టులో ఉన్న మిగిలిన 120 మందికి ఆ ఛాన్స్ ఇస్తారు. ఈ ప్లాన్ వల్ల ఒక్క ఫ్లాట్ కూడా వృథా కాకుండా అర్హుడికే దక్కుతుంది. లక్కీడ్రాలో ఎంపికైన ప్రతి కుటుంబానికి 525 చదరపు అడుగుల విస్తీర్ణంలో డబుల్ బెడ్‌రూమ్ తరహా ఫ్లాట్ అందిస్తారు. ప్రతి ఇంటికీ 17 నుంచి 20 గజాల అన్‌డివైడెడ్ షేర్ భూమి హక్కుగా లభిస్తుంది. అందుబాటులో ఉన్న స్థలాన్ని బట్టి ఆధునిక లిఫ్ట్‌లు, సీసీ కెమెరాలు, తాగునీరు, డ్రైనేజీ వంటి సకల మౌలిక వసతులతో 10 అంతస్తుల వరకు టవర్లను నిర్మిస్తారు. ఈ భవనాలు నగరంలోని ఆధునిక గేటెడ్ కమ్యూనిటీలకు ఏమాత్రం తీసిపోని విధంగా ఉంటాయి. బడుగు బలహీన వర్గాల ప్రజలు కూడా ప్రైవేట్ అపార్ట్‌మెంట్లలో ఉండే సౌకర్యాలను అనుభవించాలనేది ప్రభుత్వ ఆలోచన. లబ్ధిదారులపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వమే ఉచితంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేస్తుంది. రిజిస్ట్రేషన్ అయిన పదేళ్ల తర్వాత అవసరమైతే ఆ ఇంటిని ఇతరులకు అమ్ముకునే పూర్తి హక్కు లబ్ధిదారుడికి ఉంటుంది. పదేళ్ల కాలపరిమితి కంటే ముందు ఏదైనా తీవ్రమైన అత్యవసర పరిస్థితి వస్తే, రిజిస్ట్రేషన్ పత్రాలను బ్యాంకుల్లో తాకట్టు పెట్టి లోన్ తీసుకునే సౌలభ్యాన్ని కూడా కల్పించారు. దీనివల్ల ఆర్థిక కష్టాల సమయంలో ఈ ఇల్లు పేద కుటుంబాలకు పెద్ద ఆసరాగా నిలుస్తుంది. డాక్యుమెంట్ల వెరిఫికేషన్ పూర్తయి పత్రాలు చేతికి అందిన వెంటనే, కేవలం మూడు నాలుగు రోజుల్లోనే నిర్మాణ పనులు గ్రౌండ్ లెవల్‌లో స్టార్ట్ అవుతాయి. ఇళ్లు వేగంగా పూర్తి కావడానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని నిర్మాణ రంగంలో వాడుతున్నారు. తద్వారా నాణ్యతతో పాటు వేగం పెరుగుతుంది. సామాన్యులకు భద్రత, ఆత్మగౌరవాన్ని అందించే ఈ ప్రాజెక్ట్ నగర ముఖచిత్రాన్ని సమూలంగా మారుస్తుందని అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయాలతో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. సొంత ఇంటి రూపంలో వారికి శాశ్వత ఆస్తి సమకూరుతోంది. ఇందిరమ్మ టవర్స్ ఫ్లాట్ల కేటాయింపులో సామాజిక న్యాయాన్ని పక్కాగా అమలు చేస్తున్నారు. మొత్తం ఫ్లాట్లలో 50 శాతం రిజర్వేషన్లను వివిధ వర్గాలకు ప్రత్యేకించారు. ఇందులో ఎస్సీలకు 14 శాతం, ఎస్టీలకు 5 శాతం, బీసీలకు 16 శాతం, దివ్యాంగులకు 5 శాతం కేటాయించారు. సమాజ శ్రేయస్సు కోసం శ్రమించే పారిశుధ్య కార్మికులు, నాలుగో తరగతి సిబ్బంది, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 10 శాతం వాటా ఇచ్చారు. మహిళా సాధికారతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ మొత్తం యూనిట్లలో మహిళలకు 30 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నారు. నాంపల్లిలో ఎస్సీ కోటాలోని 67 ఫ్లాట్ల కోసం 288 మంది దరఖాస్తుదారులతో డ్రా తీశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు వేదికపై ఉండగా, లబ్ధిదారుల చేతుల మీదుగానే పేర్లు తీయించడం విశేషం. తొలి ఫ్లాట్ మరకాల కృష్ణవేణికి లభించగా, టి.అనిత, మంగనూరి అనసూయ, ఎం.కుమారి, శైలజా కుమారి లాంటి ఎందరో సామాన్యులు సొంతింటి లబ్ధిదారులుగా ఎంపికయ్యారు. అర్హులైన మహిళల పేర్లపైనే రిజిస్ట్రేషన్లు చేయడం వల్ల కుటుంబంలో వారికి భద్రత, గౌరవం రెండూ దక్కుతాయి. రాష్ట్ర వ్యాప్తంగా చూస్తే తొలి విడత కింద ప్రభుత్వం 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను సాంక్షన్ చేసింది. వీటిలో ఇప్పటికే 2 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుని గృహప్రవేశాలకు సిద్ధంగా ఉన్నాయి. ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున ప్రభుత్వం నాలుగు వేర్వేరు దశల్లో లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లోకి నేరుగా నిధులు జమ చేస్తోంది. నిర్మాణం చివరి దశకు చేరుకున్న ఇళ్లకు ఆఖరి విడత బిల్లుల చెల్లింపులు కూడా మొదలయ్యాయి. రెండో విడత కింద అదనంగా మరో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేసి దరఖాస్తుల స్క్రూటినీని వేగవంతం చేశారు. రాబోయే పది రోజుల్లో ఈ ప్రక్రియ మొత్తం క్లియర్ కానుంది. గ్రేటర్ పరిధిలో మొదటి విడతలో లక్ష ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నది ప్రభుత్వ భారీ ప్రణాళిక. అందుకోసం ఇప్పటికే నాలుగు నియోజకవర్గాల్లో అనువైన ప్రభుత్వ స్థలాలను మార్క్ చేశారు. నగరంలో ఇళ్లు లేని వారు సెప్టెంబర్ 3 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని అధికారులు కల్పించారు.


# షబ్బీర్ అలీకి రాఖీ కట్టిన రామ నరేందర్ చౌదరి

- మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్న అన్నా చెల్లెళ్ల అనుబంధం
- గంప గోవర్ధన్‌కు రాఖీ కట్టిన అక్కలు

**విశాలభారతి, కామారెడ్డి ;** రాఖీ పౌర్ణమి సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ కు ఆయన ఆత్మీయ సోదరి రామ నరేందర్ చౌదరి శుక్రవారం ఫిల్మ్ నగర్ లోని ఆయన నివాసంలో రాఖీ కట్టారు. గత మూడు దశాబ్దాలుగా ప్రతి రాఖీ పండుగకు రామ నరేందర్ చౌదరి షబ్బీర్ అలీకి రాఖీ కట్టడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా ఆమె షబ్బీర్ అలీ కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా గడిపారు. మతాలకు అతీతమైన తమ అనుబంధం అందరికీ ఆదర్శమని షబ్బీర్ అలీ తెలిపారు.

**గంప గోవర్ధన్ కు రాఖీ కట్టిన అక్కలు**

హైదరాబాద్ లో రాఖీ పౌర్ణమి వేడుకలను కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఘనంగా జరుపుకున్నారు. హైదరాబాద్ లోని తన నివాసంలో ఆయనకు అక్కలు సుగుణ, ప్రమీల, విమల రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అక్కా తమ్ముళ్ల అనుబంధాన్ని పంచుకుంటూ ఆనందంగా వేడుక జరుపుకున్నారు.





# విశ్వనగరాన్ని విషాద నగరంగా మార్చారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దుతామని ప్రగల్భాలు పలికిన గత బీఆర్‌ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు దీనిని ఒక విషాద నగరంగా మార్చేశాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో కనీస మౌలిక వసతులు కల్పించడంలో పాలకులు ఘోరంగా విఫలమయ్యారని మండిపడ్డారు. గుంతలమయంగా మారిన అధ్వానపు రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ వైఫల్యం వల్ల భాగ్యనగర ప్రజలు ప్రతిరోజూ తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు, నరకయాతన అనుభవిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం వస్తే చాలు నగర వీధులు చెరువులను తలపిస్తున్నాయని, డ్రైనేజీలు పొంగిపొర్లుతూ ప్రజారోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని విమర్శించారు. పాలకుల స్వార్థ ప్రయోజనాలు, నిధుల దుర్వినియోగం కారణంగానే హైదరాబాద్ అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని స్పష్టం చేశారు. ఐటీ కారిడార్‌లలో ట్రాఫిక్ జామ్‌లు, నివాస ప్రాంతాల్లో రోడ్ల దుస్థితి ఈ నగర బ్రాండ్ ఇమేజ్‌ను పూర్తిగా దెబ్బతీస్తున్నాయి. మోసపూరిత హామీలతో ప్రజలను మభ్యపెట్టడం మానుకోవాలని, నగరానికి పట్టిన ఈ దుస్థితికి గత, ప్రస్తుత పాలకులే ప్రత్యక్ష బాధ్యత వహించాలని ఆయన హెచ్చరించారు. ఈ పాలనపై ప్రజలు విసిగిపోయారని, ఒక సమగ్ర విజన్‌తో నగర రూపురేఖలను సమూలంగా మార్చే నాయకత్వం కోసం భాగ్యనగరవాసులు ఎదురుచూస్తున్నారని వెల్లడించారు. నగర ప్రగతి పరుగులు తీయాలంటే సమర్థవంతమైన పాలన ఒక్కటే మార్గమని చెప్పారు. హైదరాబాద్‌కు పూర్వ వైభవం తీసుకువచ్చి, అంతర్జాతీయ స్థాయిలో నిజమైన స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేయడం కేవలం భారతీయ జనతా పార్టీతోనే సాధ్యమని నగర ప్రజలు బలంగా విశ్వసిస్తున్నారని రామచందర్ రావు తెలిపారు. రాబోయే మూడు మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికల్లో ఓటర్లు బీజేపీని భారీ మెజారిటీతో గెలిపించేందుకు ఇప్పటికే సంపూర్ణంగా సిద్ధమయ్యారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం అమలు చేస్తున్న అద్భుతమైన సంక్షేమ, అభివృద్ధి పథకాలు నేరుగా అట్టడుగు వర్గాల ప్రజల వద్దకు చేరాలంటే స్థానిక సంస్థల్లో బీజేపీ గెలవడం అత్యంత ఆవశ్యకమన్నారు. మున్సిపల్ కార్పొరేషన్లలో అవినీతి లేని పారదర్శక పరిపాలనను అందించి, ప్రజలు చెల్లించే ప్రతి రూపాయి పన్నును వారి సౌకర్యాల కోసమే ఖర్చు చేస్తామని ఆయన స్పష్టమైన హామీ ఇచ్చారు. యువత, నిపుణులు మెచ్చేలా ఐటీ రంగం, స్టార్టప్ ఎకోసిస్టమ్, గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి రంగాలకు పెద్దపీట వేయనున్నట్లు ప్రకటించారు. నగరంలో ప్రజా రవాణా వ్యవస్థను ఆధునీకరించి, అర్బన్ ప్లానింగ్‌ను పకడ్బందీగా అమలు చేసే సమగ్ర కార్యాచరణ బీజేపీ వద్ద సిద్ధంగా ఉందని వివరించారు. ప్రజల జీవితాల్లో నిజమైన మార్పు తీసుకురావడానికి, మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడానికి తమ పార్టీ చిత్తశుద్ధితో నిరంతరం కృషి చేస్తుందని తేల్చిచెప్పారు. అంతకుముందు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మహిళా మోర్చా ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా జరిగిన రక్షా బంధన్ వేడుకల్లో రామచందర్ రావు ముఖ్య అతిథిగా ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా నేతలు, కార్యకర్తలు ఆయనకు ఆప్యాయంగా రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రామచందర్ రావు ప్రసంగిస్తూ.. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ఉండే పవిత్రమైన అనుబంధానికి, రక్షణ భావనకు రక్షాబంధన్ మహోన్నతమైన ప్రతీక అని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళా సాధికారత, వారి సంక్షేమానికి దేశ చరిత్రలోనే ఎన్నడూ లేనంత అత్యున్నత ప్రాధాన్యం ఇచ్చారని కొనియాడారు. దేశ ప్రగతిలో మహిళల భాగస్వామ్యం లేనిదే వికసిత్ భారత్ కల సాకారం కాదని మోదీ ప్రభుత్వం గట్టిగా నమ్ముతోందని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందించే ఉజ్వల యోజన, ప్రతి ఇంటికీ మరుగుదొడ్ల నిర్మాణం, ముద్ర లోన్ల ద్వారా స్వయం ఉపాధి కల్పన వంటి విప్లవాత్మక పథకాలు మహిళల జీవన ప్రమాణాలను గణనీయంగా పెంచాయని ఆయన గుర్తుచేశారు. ఈ ఆధునిక యుగంలో మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోతూ లీడర్‌షిప్ రోల్స్ చేపట్టేలా కేంద్ర ప్రభుత్వం బలమైన పునాదులు వేసిందని ప్రశంసించారు. దేశ చరిత్రలో మైలురాయిగా నిలిచే విధంగా మహిళలకు చట్టసభల్లో ముప్పై మూడు శాతం రిజర్వేషన్లు కల్పించే అత్యున్నత 'నారీ శక్తి వందన్' చట్టాన్ని పార్లమెంటులో మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టి చారిత్రాత్మక విజయం సాధించిందని రామచందర్ రావు స్పష్టం చేశారు. మహిళల రాజకీయ ఎదుగుదలకు, వారి నిర్ణయాధికారానికి బాటలు వేసే ఈ విప్లవాత్మక బిల్లును పార్లమెంట్ వేదికగా కాంగ్రెస్, ఇండియా కూటమి పార్టీలు అడుగడుగునా అడ్డుకునేందుకు కుటిల ప్రయత్నాలు చేశాయని ఆయన తీవ్రంగా మండిపడ్డారు. మహిళలకు అసెంబ్లీ, పార్లమెంటులో సముచిత స్థానం దక్కకుండా దశాబ్దాలుగా కాలయాపన చేస్తూ అనేక అడ్డంకులు సృష్టించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని ఆయన ధ్వజమెత్తారు. విపక్షాలు మహిళా సాధికారత గురించి కేవలం ఎన్నికల వేళ మాత్రమే కపట నాటకాలు ఆడతాయని, వాస్తవంలో అవి పచ్చి మహిళా వ్యతిరేక పార్టీలని తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో మహిళలు తమ హక్కుల పట్ల మరింత చైతన్యవంతంగా వ్యవహరించి, ఇలాంటి ద్వంద్వ వైఖరి కలిగిన రాజకీయ పార్టీలకు తగిన రీతిలో బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరిగినప్పుడే ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని, ఆ లక్ష్యం నెరవేరే వరకు బీజేపీ అండగా పోరాడుతుందని భరోసా ఇచ్చారు. ఇటీవల పొరుగు దేశమైన నేపాల్‌లో సంభవించిన ఆకస్మిక వరద విపత్తు, భారీ ప్రాణ నష్టంపై రామచందర్ రావు తీవ్ర దిగ్భ్రాంతి, ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

# రాఖీతో రాజీ.. అంత ఈజీ కాదు!

**మొదటిపేజీ తరువాయి**

పంచాయితీల తర్వాత ఈ భేటీ జరగడం పెద్ద చర్చకు దారితీసింది. పబ్లిక్ స్పేస్‌లో విభేదాలు రచ్చకెక్కకుండా చూసేందుకు ఇద్దరు నేతలు చాలా తెలివిగా వ్యవహరించారు. కెమెరాల ముందు చిరునవ్వులు చిందిస్తూ కనిపించడం ఒక క్లాసిక్ పీఆర్ మూవ్‌గా నిలిచింది. పార్టీ క్యాడర్‌లో కన్ఫ్యూజన్ తగ్గించడానికి, అంతా కూల్‌గానే ఉందనే సిగ్నల్ ఇవ్వడానికి ఈ అకేషన్‌ను వాడుకున్నారు. రాజకీయాల్లో పర్సనల్ ఈగోల కంటే పబ్లిక్ ఇమేజ్ చాలా ముఖ్యం. ఈ ఒక్క మీటింగ్ ద్వారా క్యాడర్‌కు ప్రస్తుతానికి ఊరట లభించినట్టు కనిపిస్తోంది. ఒకవేళ సురేఖ ఈసారి రాఖీ కట్టకపోయి ఉంటే పరిణామాలు చాలా సీరియస్‌గా మారేవి. ఇప్పటికే విభేదాలు తారాస్థాయికి చేరాయనే ప్రచారానికి అది మరింత బలం ఇచ్చేది. అటు సీఎం రేవంత్ రెడ్డి కూడా ఆమెకు అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా తిరస్కరిస్తే ఓపెన్ వార్ మొదలయ్యేది. అనుభవజ్ఞులైన లీడర్లుగా రేవంత్ రెడ్డి ఫోటోకోసం ఫాలో అవుతూ పరిస్థితిని చాలా కూల్‌గా హ్యాండిల్ చేశారు. పార్టీ ప్రతిష్ఠ దెబ్బతినకుండా, గవర్నమెంట్ స్థిరత్వానికి ఎలాంటి ఢోకా లేదని చూపించేలా అడుగులు వేశారు. ఇరువైపులా ఉన్న పొలిటికల్ ఇంట్రెస్ట్స్ వల్ల ఈ భేటీ సాఫీగా సాగిపోయింది. కేవలం ఫోటోలు కోసమే అయినా ఇద్దరూ తమ బాధ్యతను పక్కాగా నిర్వర్తించారు. ఇలాంటి క్లిష్ట సమయాల్లో వేసే చిన్నపాటి మూవ్స్ కూడా పెద్ద పొలిటికల్ ఇంపాక్ట్ చూపిస్తాయి. ప్రత్యర్థులకు ఎలాంటి స్పేస్ ఇవ్వకుండా ఇద్దరూ జాగ్రత్త పడ్డారు. ప్రస్తుతం కాంగ్రెస్ వర్గాల్లో ఈ భేటీ గురించే జోరుగా చర్చలు సాగుతున్నాయి. ఫోటోలు, స్వీట్ల మార్పిడితో బ్యాక్‌గ్రౌండ్‌లో ఉన్న అసలు సమస్యలు మాయమైపోతాయని అనుకోవడం పొరపాటే అవుతుంది. క్లోజ్డ్ డోర్స్ వెనుక జరిగే పవర్ పాలిటిక్స్ వేరు. కొండా ఫ్యామిలీ చేసిన కామెంట్స్ ఇంకా అధిష్ఠానం పరిశీలనలోనే ఉన్నాయి. అంతర్గతంగా వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలనే డిమాండ్, పార్టీ సీనియర్ల నుంచి పూర్తిగా తగ్గలేదు. లీడర్ల మధ్య మైండ్ గేమ్స్ ఎప్పుడూ అంత ఈజీగా ముగిసిపోవు. రాఖీ కట్టడం వల్ల తాత్కాలికంగా టెన్షన్ తగ్గినట్టు కనిపించినా, లోపల ఉన్న అసంతృప్తి సెగలు అలాగే ఉన్నాయి. రాజకీయాల్లో నిర్ణయాలు ఎమోషన్స్‌తో కాకుండా



వ్యూహాలతోనే జరుగుతాయి. క్యాడర్‌ను మెప్పించడానికి వేసిన ఈ స్టెప్ అసలు వివాదానికి ఫుల్‌స్టాప్ పెట్టలేదు. కేవలం సమస్యను కొద్దిరోజుల పాటు పక్కకు నెట్టింది. రాబోయే రోజుల్లో వచ్చే అధికారిక నిర్ణయాలే అసలు వాస్తవాలను బయటపెడతాయి. రాజకీయాల్లో డ్యామేజ్ కంట్రోల్ అనేది ఒక ఆర్ట్ లాంటిది, ఈ రాఖీ భేటీ దానికి పర్ఫెక్ట్ ఎగ్జాంపుల్. ప్రభుత్వం, పార్టీ మధ్య ఎలాంటి గ్యాప్ లేదని ప్రజల్లోకి ఒక పాజిటివ్ వైబ్ పంపడంలో నేతలు సక్సెస్ అయ్యారు. సోషల్ మీడియాలో ట్రోల్స్, నెగెటివ్ వార్తలకు చెక్ పెట్టేందుకు ఈ విజువల్స్ ఉపయోగపడ్డాయి. అయితే అసలు అసెస్మెంట్ ఇక్కడి నుంచే మొదలవుతుంది. పార్టీ క్రమశిక్షణా కమిటీ ఈ వివాదంపై ఎలాంటి రిపోర్ట్ ఇస్తుంది, సీఎం రేవంత్ రెడ్డి తదుపరి స్టెప్స్ ఎలా ఉంటాయనేది ఆసక్తికరంగా మారింది. అటు కొండా దంపతులు భవిష్యత్తులో తమ వైఖరిని ఎలా మార్చుకుంటారో చూడాలి. వారు చేసే కామెంట్స్ పైనే ఈ భేటీ విలువ ఆధారపడి ఉంటుంది. స్టేట్‌మెంట్లలో మార్పు రాకపోతే ఈ రాఖీ వేడుక ఒక నామమాత్రపు ఈవెంట్‌గా మాత్రమే మిగిలిపోతుంది. పొలిటికల్ సర్కిల్స్‌లో ఇప్పుడు ఈ నెక్స్ట్ మూవ్స్ గురించే తీవ్ర ఉత్కంఠ నెలకొంది. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం పేరుతో జరిగే రచ్చలు కొత్తేమీ కావు. సురేఖ ఎపిసోడ్ కూడా అందులో ఒక భాగమే. రేవంత్ రెడ్డి తన నాయకత్వాన్ని నిరూపించుకుంటూనే అసమ్మతి గళాలను కంట్రోల్ చేయాల్సిన అవసరం ఉంది. సురేఖ సీనియర్ నాయకురాలు కావడం వల్ల ఆమెను పూర్తిగా పక్కన పెట్టడం పార్టీకి నష్టం కలిగించవచ్చు. అందుకే ఇద్దరి మధ్య బ్యాలెన్స్ మెయింటైన్ చేయడం అత్యంత కీలకం. ఈ రాఖీ మీటింగ్ ద్వారా తాము చర్చలకు సిద్ధంగానే ఉన్నామని ఇరువర్గాలు పరోక్షంగా సంకేతాలు ఇచ్చాయి. ఈక్వేషన్స్ సెట్ అవ్వాలంటే ఇంకా చాలా గ్రౌండ్ వర్క్ జరగాల్సి ఉంది. కేవలం ఒక ఫెస్టివల్ మీటప్‌తో అన్ని పాత వివాదాలు క్లియర్ అయిపోవు. అంతర్గత భేటీలు, సమన్వయ కమిటీ నిర్ణయాలు మాత్రమే అసలైన పరిష్కారాన్ని చూపించగలవు. అప్పటివరకు ఈ రాజకీయ విరామం కొనసాగే అవకాశం కనిపిస్తోంది. తరానికి ఈ రాజకీయాలు చాలా ఫాస్ట్‌గా, కన్ఫ్యూజింగ్‌గా అనిపించవచ్చు. ఒకరోజు ఘాటైన విమర్శలు చేసుకోవడం, మరుసటి రోజే కలిసి ఫోటోలకు పోజులివ్వడం పాలిటిక్స్‌లో కామన్‌గా మారిపోయింది. అధికారం, స్థానం కాపాడుకోవడానికి నేతలు వేసే ఎత్తుగడలు చాలా చిత్రంగా ఉంటాయి. కొండా సురేఖ రేవంత్ రెడ్డి వ్యవహారం కూడా సరిగ్గా ఇలాంటిదే. ప్రజల మైండ్‌సెట్‌ను డైవర్ట్ చేయడానికి ఇలాంటి పొలిటికల్ పిక్చర్స్ బాగా పని చేస్తాయి. బయటకు అంతా బాగానే ఉందని ప్రొజెక్ట్ చేస్తూనే, లోపల తమ పట్టు కోసం తీవ్రంగా ప్రయత్నిస్తుంటారు. ఈ రాజకీయ గేమ్‌లో ఎవరు పైచేయి సాధిస్తారో ఇప్పుడే చెప్పడం కష్టం. లీడర్ల మధ్య ఉండే విశ్వాసం తిరిగి బలపడాలంటే మరికొంత సమయం పడుతుంది. ఈ డ్రామాలో నెక్స్ట్ ఎపిసోడ్ ఎలా ఉండబోతుందో అని ప్రజలు ఆసక్తిగా గమనిస్తున్నారు. మొత్తంగా చూస్తే కొండా సురేఖ రాఖీ కట్టిన ఎపిసోడ్ ఒక చిన్న ఉపశమనం మాత్రమే. వివాదాల మంటపై తాత్కాలికంగా నీళ్లు చల్లినట్లు అయింది. రేవంత్ రెడ్డి తన పరిణతిని చాటుకోగా, సురేఖ కూడా తన రాజకీయ ఉనికిని బలంగానే చాటుకున్నారు. భవిష్యత్తులో జరిగే కేబినెట్ సమావేశాలు, పార్టీ కార్యక్రమాలు అసలు సమీకరణాలను స్పష్టం చేస్తాయి. అక్కడ వీరిద్దరి ప్రవర్తన ఎలా ఉంటుందనే దానిపైనే సర్కారు ఇమేజ్ ఆధారపడి ఉంటుంది. అసంతృప్తి నిజంగానే తగ్గిందా లేదా అనేది కాలమే తేల్చాలి. ఈ ఘటనను వివాదానికి ముగింపుగా కాకుండా, కేవలం ఒక తాత్కాలిక బ్రేక్‌గా మాత్రమే చూడాలి. రాబోయే రాజకీయ పరిణామాలు మరింత రసవత్తరంగా మారే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అప్పుడే అసలు బంధం ఎంత బలమైనదో అందరికీ పూర్తిగా అర్థమవుతుంది.

# తెలంగాణలో ఉన్నది ప్రజా ప్రభుత్వమా?



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు ప్రజాస్వామ్య వ్యవస్థను తీవ్రంగా ప్రశ్నించేలా చేస్తున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ప్రజాపాలన అని చెప్పుకుంటున్న పాలకులు, క్షేత్రస్థాయిలో అసలైన స్వేచ్ఛను కాలరాస్తున్నారని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత కొద్ది రోజులుగా వరుసగా చోటుచేసుకుంటున్న విపరీతమైన పోలీస్ దౌర్జన్యాలు ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నాయి. సోషల్ మీడియా వేదికగా ఆయన సీఎం రేవంత్ రెడ్డి, డీజీపీని సూటిగా ప్రశ్నిస్తూ, అసలు రాష్ట్రంలో నడుస్తున్నది ప్రజల ప్రభుత్వమా లేక పోలీసుల రాచరిక పాలనా అని నిలదీశారు. ప్రశ్నించే గొంతులను అణచివేయడం, నిరసనలపై లాఠీలు ఝుళిపించడం నేటి ట్రెండ్‌గా మారిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపితే తప్పుడు కేసులు బనాయిస్తూ బెదిరింపులకు దిగడం ఆధునిక సమాజంలో ఎవరూ హర్షించని విషయమని ఆయన స్పష్టం చేశారు. బాధితులకు న్యాయం చేయాల్సిన రక్షకభటులే భక్షకులుగా మారడం వ్యవస్థకే తీరని మచ్చగా మారిందని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో కేవలం మూడు రోజుల వ్యవధిలోనే జరిగిన అమానవీయ ఘటనలు ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేశాయి. మహబూబాబాద్‌లో హక్కుల కోసం మాట్లాడిన ఓ పాలిటెక్నిక్ విద్యార్థి గొంతు పిసికి పోలీసు అధికారి క్రూరంగా ప్రవర్తించిన తీరు సమాజంలో తీవ్ర చర్చనీయాంశమైంది. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట పోలీస్ స్టేషన్‌లో జరిగిన ఉదంతం మరింత దారుణంగా మారింది. తన కన్న కూతురికి జరిగిన ఘోరమైన అవమానంపై ఫిర్యాదు ఇచ్చేందుకు స్టేషన్‌కు వచ్చిన ఒక సామాన్య తండ్రిని పోలీసులు బూటు కాళ్లతో చితకబాదారు. అంతటితో ఆగకుండా బాధితుడితో బలవంతంగా మూత్రం తాగించారనే తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తడం అత్యంత హేయమైన చర్యగా నిలిచింది. న్యాయం కోసం వెళ్లిన సామాన్యుడిని ఈ విధంగా హింసించడం ఏ రకమైన పాలన అని నేతలు ప్రశ్నిస్తున్నారు. చట్టాన్ని రక్షించాల్సిన వారే కస్టోడియల్ వేధింపులకు పాల్పడితే సామాన్య పౌరులు ఎవరి దగ్గరకు వెళ్లాలని ప్రజలు నిలదీస్తున్నారు. సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో చోటుచేసుకున్న తాజా ఘటన పోలీసుల అహంకారానికి పరాకాష్ఠగా నిలిచింది. 32వ వార్డు పరిధిలోని చిరువ్యాపారులకు ఎలాంటి ముందస్తు నోటీసులు జారీ చేయకుండా మున్సిపల్ అధికారులు రాత్రికి రాత్రే షాపులను కూల్చివేశారు. తమ జీవనాధారాన్ని కోల్పోయిన పేదలు ప్రధాన రహదారిపై శాంతియుతంగా ధర్నాకు దిగితే, స్థానిక సీఐ వారిపై విచక్షణారహితంగా విరుచుకుపడ్డారు. నిరసన తెలుపుతున్న ఒక సామాన్య వ్యక్తి గొంతు నొక్కి నేలపై పడేసి కర్కశంగా కొట్టారు. ఆ దారుణాన్ని అడ్డుకునేందుకు ముందుకు వచ్చిన మహిళలను కూడా ఏమాత్రం కనికరం లేకుండా తోసివేసి దురుసుగా ప్రవర్తించారు. కేవలం సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారనే చిన్న కారణంతో కేసులు పెట్టి, బతుకుదెరువు కోసం పెట్టుకున్న బడ్డీ కొట్లను ధ్వంసం చేయడం మానవ హక్కుల ఉల్లంఘనే అవుతుంది. పేదల పొట్టకొట్టే చర్యలను సమర్థించుకుంటూ ఖాకీ డ్రెస్సుతో జులుం ప్రదర్శించడం ప్రజాస్వామ్యానికి చేటు తెస్తుంది. ఈ అమానుష ఘటనపై బీఆర్‌ఎస్ ముఖ్య నేత ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ స్పందిస్తూ సర్కార్‌పై ఘాటు వ్యాఖ్యలు చేశారు. పేదలు, బలహీన వర్గాలపై మాత్రమే మీ ప్రతాపం చూపిస్తారా అని ముఖ్యమంత్రిని, డీజీపీని ఆయన గట్టిగా నిలదీశారు. వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమించుకున్న అధికార పార్టీ మంత్రులపై ఇలాంటి కఠినమైన చర్యలు తీసుకునే దమ్ముందా అని సూటి ప్రశ్నలు వేశారు. గతంలో ఇదే కోదాడ ప్రాంతంలో కర్ల రాజేష్ అనే దళిత యువకుడిని లాకప్‌లో చిత్రహింసలు పెట్టి ప్రాణాలు తీశారని గుర్తుచేశారు. ఆ దారుణం మరవకముందే మళ్లీ అదే తరహాలో పేదలపై రక్తదాహం ప్రదర్శించడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో సామాజిక న్యాయం పూర్తిగా కనుమరుగైందని, బడుగుల రక్షణ ప్రశ్నార్థకంగా మారిందని హెచ్చరించారు. అమాయకుల ప్రాణాలను బలితీసుకుంటూ రాష్ట్రాన్ని ప్రమాదకరమైన దిశలోకి నెడుతున్నారని ఆయన గట్టిగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత కాలంలో డిజిటల్ యుగంలో సోషల్ మీడియా యువతకు ఆలోచనలను పంచుకునే ప్రధాన వేదికగా మారింది. తెలంగాణలో ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపుతూ పోస్టులు పెడితే చాలు, అర్ధరాత్రి ఇళ్లపై పడి అరెస్టులు చేస్తున్న తీరు తీవ్ర నిరంకుశత్వానికి నిదర్శనం. ప్రశ్నిస్తే సంకెళ్లు, నిరసనలకు దిగితే జైలు గోడలు, ప్రాథమిక హక్కులను కోరితే లాఠీ దెబ్బలే సమాధానమా అనే నిరసన సర్వత్రా వ్యక్తమవుతోంది. ప్రజాస్వామ్యంలో విమర్శలను స్వీకరించి సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత పాలకవర్గంపై ఉంటుంది. దానికి విరుద్ధంగా గొంతు నొక్కే పద్ధతి సమాజ పురోగతికి గొడ్డలిపెట్టు లాంటిది. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా ప్రవర్తించకుండా, పోలీసు బలగాలను తమ రాజకీయ ప్రయోజనాల కోసం స్వార్థంతో వాడుకోవడం రాజ్యాంగ విరుద్ధం. యువత, విద్యావంతులు ఈ వైఖరిని గమనిస్తూ తమ అసమ్మతిని వివిధ వేదికల ద్వారా స్పష్టంగా వ్యక్తం చేస్తున్నారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన వ్యవస్థ పాలకపక్షానికి అనుకూలంగా వ్యవహరించడం వల్ల సామాన్య ప్రజల్లో రక్షణ భావన పూర్తిగా తగ్గిపోతోంది. హరీష్ రావు డిమాండ్ చేసినట్లుగా తక్షణమే ఈ వరుస అకృత్యాలకు బాధ్యులైన పోలీస్ అధికారులపై ఉన్నతస్థాయి విచారణ జరిపించాలి. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ప్రవర్తించిన సిబ్బందిని వెంటనే ఉద్యోగం నుంచి సస్పెండ్ చేయడంతో పాటు కఠినమైన చట్టపరమైన శిక్షలు అమలు చేయాలి. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా డీజీపీ కఠినమైన మార్గదర్శకాలను జారీ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పాలకులు ప్రజాపాలన అనే బోర్డులు తగిలించుకుంటే సరిపోదు, ఆచరణలో ప్రజల ప్రాథమిక హక్కులను కాపాడాలి. నిరంకుశ పోకడలను పక్కనపెట్టి, రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెడుతూ పాలన సాగించకపోతే ప్రజాక్షేత్రంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వాస్తవ పరిస్థితులను గుర్తించి బాధితులకు తక్షణ న్యాయం అందించాలి.

# కరీంనగర్ 'సుడా' పీఠం దక్కేదెవరికి ?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయ ముఖచిత్రం ఇప్పుడు శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ పీఠం చుట్టూ వేగంగా తిరుగుతోంది. గత నెల ఎనిమిదో తేదీన మునుపటి చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి పదవీకాలం అధికారికంగా ముగిసింది. అప్పటి నుంచి అధికార కాంగ్రెస్ పార్టీలోని సీనియర్ నేతలు, ద్వితీయ శ్రేణి లీడర్లు ఈ కీలక పోస్టును దక్కించుకోవడానికి తీవ్ర స్థాయిలో పైరవీలు మొదలుపెట్టారు. ఒకప్పుడు కేవలం శాతవాహన యూనివర్సిటీ సరిహద్దులకే పరిమితమైన సుడా అధికార పరిధి ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా భారీగా విస్తరించింది. విస్తీర్ణం పెరగడంతో పాటు బడ్జెట్ కేటాయింపులు, పాలనాధికారాలు పెరగడం వల్ల జిల్లా రాజకీయాల్లో దీనికి విపరీతమైన క్రేజ్ వచ్చింది. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం భారీ స్థాయిలో నామినేటెడ్ పోస్టుల జాబితాను విడుదల చేయబోతోంది. అందులో కరీంనగర్ సుడా చైర్మన్ నియామకం అత్యంత కీలకంగా మారింది. గ్రౌండ్ లెవల్ రాజకీయాల్లో గట్టి పట్టు సాధించాలనే లక్ష్యంతో ఆశావహులు తమ గాడ్‌ఫాదర్ల ద్వారా గాంధీ భవన్, సెక్రటేరియట్ వర్గాల్లో తీవ్రంగా లాబీయింగ్ నడుపుతున్నారు. ఈ సారి రేసు మరింత రసవత్తరంగా మారింది. ఈ ప్రతిష్టాత్మక చైర్మన్ కుర్చీ కోసం జిల్లా స్థాయి కాంగ్రెస్ సీనియర్లలో తీవ్రమైన పోటీ నెలకొంది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో పార్టీ హైకమాండ్ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే టికెట్ త్యాగం చేసినందుకు గాను కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డికి గతంలో సుడా పగ్గాలు దక్కాయి. ఆయన తన పదవీకాలాన్ని పొడిగించుకోవాలని చూస్తున్నారు. ఇందుకోసం జిల్లా సీనియర్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అండదండలతో ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. విద్యా రంగంలో ప్రముఖుడిగా ఉంటూ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో నిలిచిన అల్ఫోర్స్ అధినేత వూటుకూరి నరేందర్‌రెడ్డి కూడా తీవ్రంగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఆకారపు భాస్కర్ రెడ్డి రేసులో గట్టిగా వినిపిస్తున్న మరో ప్రముఖ పేరు. ఆయనకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పూర్తి ఆశీస్సులు ఉన్నట్లు స్థానిక కేడర్ భావిస్తోంది. గతంలో తమ వంతు కృషి చేసిన ఈ సీనియర్ నాయకులంతా తమదైన శైలిలో పీసీసీ పరిశీలకులతో పాటు మంత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. జిల్లా రాజకీయాల్లో సామాజిక సమీకరణాలు కూడా ఇప్పుడు చాలా బలంగా పనిచేస్తున్నాయి. గత విడతలో ఈ పదవిని ఓసీ వర్గానికి చెందిన రెడ్డి సామాజిక వర్గానికి కేటాయించారు. ఈసారి జనాభా ప్రాతిపదికన బీసీ వర్గానికి చెందిన నాయకుడికే కచ్చితంగా ఇవ్వాలని సీనియర్ కార్పొరేటర్ మల్లికార్జున రాజేందర్ హైకమాండ్ వద్ద గట్టిగా పట్టుబడుతున్నారు. గతంలో కోహెడ ఎంపీపీగా బాధ్యతలు నిర్వర్తించిన రాచకొండ చక్రధర్ రావు కూడా మంత్రి పొన్నం మద్దతుతో బరిలో నిలిచారు. పీసీసీ ప్రధాన కార్యదర్శిగా సేవలందిస్తున్న రహమత్ హుస్సేన్ మైనార్టీ కోటాలో తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి చెందిన పులిమల్ల శ్రీనివాస్ సైతం తన ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. సామాజిక న్యాయం పాటించాలని భావిస్తే బీసీ లేదా మైనార్టీ లీడర్ల వైపు కాంగ్రెస్ హైకమాండ్ మొగ్గు చూపే బలమైన అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో ఆయా వర్గాల ఆశావహులు తమ వంతు శక్తిసామర్థ్యాలు ఒడ్డుతున్నారు. కరీంనగర్ జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్న ముగ్గురు కీలక మంత్రుల ఏకాభిప్రాయం మీదే ఈ నియామకం పూర్తిగా ఆధారపడి ఉంది. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఉమ్మడిగా చర్చించి ఒక అభ్యర్థి పేరును ఫైనల్ చేయాల్సి ఉంటుంది. పార్టీ ప్రతిపక్షంలో ఉన్న కష్టకాలంలో జెండా మోసిన నిజమైన కార్యకర్తలకే నామినేటెడ్ పోస్టులు ఇస్తామని పార్టీ అధిష్టానం పలుమార్లు తేల్చి చెప్పింది. ఈ ప్రకటన కింది స్థాయి లీడర్లలో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది. నామినేటెడ్ పోస్టుల్లో సుమారు డెబ్బై శాతం పదవులు పార్టీ విధేయులకే దక్కుతాయని పీసీసీ వర్గాలు ఇప్పటికే స్పష్టం చేశాయి. కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందనే నమ్మకంతో ద్వితీయ శ్రేణి నాయకులు మంత్రుల దృష్టిని ఆకర్షిస్తున్నారు. ఈ ముగ్గురు మంత్రుల మధ్య సమన్వయం కుదిరితేనే చైర్మన్ పేరు అధికారికంగా ఖరారవుతుంది. లేదంటే అధిష్టానం తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. సుడా చైర్మన్ పదవి అనేది సాధారణ నామినేటెడ్ హోదా మాత్రమే కాదు. ఇది కరీంనగర్ సిటీ ఓవరాల్ గ్రోత్, మాస్టర్ ప్లాన్ డిజైన్, నిధుల వినియోగంలో అత్యంత కీలకమైన అడ్మినిస్ట్రేటివ్ రోల్. గత నగర పాలక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అతి స్వల్ప తేడాతో మేయర్ పీఠాన్ని చేజార్చుకుంది. ఆ అవకాశాన్ని అందిపుచ్చుకున్న బీజేపీ అక్కడ అధికారాన్ని కైవసం చేసుకుంది. భవిష్యత్తులో రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని కాంగ్రెస్ ప్లాన్ చేస్తోంది. ప్రత్యర్థులైన బీజేపీ, బీఆర్‌ఎస్ వ్యూహాలను దీటుగా ఎదుర్కోవాలంటే మంచి ప్రజాదరణ, బలమైన మాస్ ఫాలోయింగ్ ఉన్న లీడర్‌కే ఈ పదవిని ఇవ్వాలని కేడర్ గట్టిగా కోరుకుంటోంది. సమర్థవంతమైన పాలన అందించే నాయకుడు సుడా చైర్మన్ అయితే అభివృద్ధి పనులు పరుగులు పెడతాయి. పట్టణ పరిధిలోని ఓటర్లను సైతం పార్టీ వైపు తిప్పుకోవడానికి వీలవుతుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళా వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలనే పాలసీని కాంగ్రెస్ అధిష్టానం ప్రస్తుతం సీరియస్‌గా అమలు చేస్తోంది. ఈ క్రమంలో బలహీన వర్గాలు లేదా మైనార్టీ నేతలకే అధిక ప్రాధాన్యత లభించే పరిస్థితులు కనిపిస్తున్నాయి. పట్టణ ప్రాంత అభివృద్ధిని పరుగులు పెట్టించగల సత్తా, ప్రజాబలం, పార్టీ పట్ల నిబద్ధత ఉన్న నాయకుడి కోసం మంత్రుల బృందం అన్వేషిస్తోంది.

# నీళ్ల విషయంలో నో కాంప్రమైజ్



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

అంతర్రాష్ట్ర జల వివాదాలపై తెలంగాణ ప్రభుత్వం చాలా కఠినంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రానికి రావలసిన నీటి వాటాలు దక్కించుకోవడానికి న్యాయపరమైన వేదికలపై గట్టిగా పోరాడాలని ఆయన స్పష్టం చేశారు. మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో నీటిపారుదల శాఖకు సంబంధించిన వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సెప్టెంబరు మొదటి వారంలో జరగబోయే కీలకమైన సమావేశాల అజెండా పైన ముఖ్యమంత్రి ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. పొరుగు రాష్ట్రాలతో ఉన్న నదీ జలాల వివాదాలను పరిష్కరించుకోవడంలో ఎలాంటి నిర్లక్ష్యం వద్దు అని ఆయన తేల్చిచెప్పారు. తెలంగాణ రైతాంగ ప్రయోజనాలు కాపాడే బాధ్యత అధికారులపై ఉందని ఆయన గుర్తు చేశారు. రాష్ట్ర తాగునీటి అవసరాలు తీర్చడానికి అవసరమైన కార్యాచరణను ఇప్పుడే సిద్ధం చేసుకోవాలని ఆయన సూచించారు. ఢిల్లీ వేదికగా జరగబోయే ఉన్నత స్థాయి అధికారుల భేటీలో తెలంగాణ వాదన గట్టిగా వినిపించాలని సీఎం అధికారులను కోరారు. సెప్టెంబరు ఒకటిన తుమ్మిడిహట్టి అంశంపై ఢిల్లీలో ప్రత్యేక సమావేశం జరగనుంది. సెప్టెంబరు ఏడవ తేదీన కేంద్ర జలవనరుల సంఘం హైలెవెల్ కమిటీ సమావేశం కూడా జరగాల్సి ఉంది. ఈ సమావేశాలలో రాష్ట్రం తరఫున ఏ విధంగా వాదనలు వినిపించాలనే దానిపై అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. సుప్రీంకోర్టుతో పాటు కేంద్ర జలవనరుల సంఘం వద్ద పెండింగ్‌లో ఉన్న వివిధ కేసుల ప్రస్తుత పరిస్థితిని ఆయన అడిగి తెలుసుకున్నారు. ఇతర రాష్ట్రాల తరఫున జరుగుతున్న వాదనలను తిప్పికొట్టడానికి అనుకూలమైన పత్రాలు సిద్ధం చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు శాఖకు చెందిన పలువురు నిపుణులు పాల్గొన్నారు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం తన వైఖరిని చాలా స్పష్టంగా అందరి ముందుంచింది. ఈ నెల ఇరవై ఆరో తేదీన జరిగిన కేఆర్ఎంబీ సమావేశంలో అధికారులు రాష్ట్ర అభ్యంతరాలను బలంగా వినిపించారు. వచ్చే ఏడాది ఆగస్టు వరకు తాగునీటి అవసరాల కోసం నూట పన్నెండు టీఎంసీల నీటిని కేటాయించాలని బోర్డును కోరారు. శ్రీశైలం అలాగే నాగార్జునసాగర్ ప్రాజెక్టులలో ఎప్పుడూ తగినంత నీటి నిల్వ ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాగునీటి అవసరాల కోసం కేవలం నలభై ఏడు టీఎంసీలు మాత్రమే కేటాయించాలని చేసిన ప్రతిపాదనను తెలంగాణ తీవ్రంగా వ్యతిరేకించింది. ఇరు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఆ సమావేశం ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే వాయిదా పడింది. సెప్టెంబరు నాల్గవ తేదీన జరగబోయే తదుపరి కేఆర్ఎంబీ సమావేశంలోనూ తెలంగాణ ప్రయోజనాల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. బోర్డు సమావేశంలో ఎలాంటి ఒత్తిడిలు వచ్చినా రాష్ట్ర వాదనకు కట్టుబడి ఉండాలని సీఎం అధికారులకు తేల్చిచెప్పారు. ఎల్ నినో ప్రభావం కారణంగా ఈ ఏడాది వర్షపాతం కొంత తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఈ వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తాగునీటి కేటాయింపులలో రాజీ పడకూడదని ప్రభుత్వం భావిస్తోంది. గ్రామీణ ప్రాంతాల తాగునీటి అవసరాలు తీర్చడానికి నీటి నిల్వలు అత్యంత కీలకం కాబట్టి ముందుచూపుతో వ్యవహరించాలని అధికారులకు సూచించారు. రాబోయే వేసవి కాలంలో నీటి ఎత్తిపోతల పథకాల నిర్వహణకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని ముఖ్యమంత్రి కోరారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత నీటి పారుదల రంగానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోంది. ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేయడంతో పాటు ఉన్న నీటిని సద్వినియోగం చేసుకోవడంపై ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించింది. పొరుగు రాష్ట్రాలు ప్రాజెక్టుల నీటిని అక్రమంగా తరలించుకుపోతున్న తీరును ఎప్పటికప్పుడు కేంద్ర సంస్థల దృష్టికి తీసుకువెళ్తున్నారు. న్యాయస్థానాలలో ఉన్న వివాదాలపై అనుభవజ్ఞులైన లాయర్లతో మాట్లాడి తగిన సలహాలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. తెలంగాణ రైతుల హక్కుల పరిరక్షణలో ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని ఈ సమావేశం ద్వారా మరోసారి రుజువైంది. ప్రతి నీటి బొట్టును జాగ్రత్తగా వాడుకునేలా ప్రజలలో కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. నీటి పారుదల రంగానికి కేటాయించే బడ్జెట్ నిధులు సద్వినియోగం కావాలని ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. పెండింగ్ ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయడం ద్వారా ఆయకట్టు స్థిరీకరణకు పెద్దపీట వేయాలని అధికారులను ఆదేశించారు. గోదావరి అలాగే కృష్ణా బేసిన్లలో మన రాష్ట్రానికి రావాల్సిన ప్రతి టీఎంసీ నీటిని దక్కించుకోవడానికి పక్కా ప్రణాళిక సిద్ధం చేశారు. అధికారుల బృందం ఢిల్లీ పర్యటనలో కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్ర సమస్యలను మరోసారి వివరిస్తారని తెలుస్తోంది. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నీటి వనరుల వినియోగం జరిగేలా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాబోయే కాలంలో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం పూర్తిగా సన్నద్ధమవుతోంది.

# రాఖీ పండుగ.. ఆర్టీసీ ఛార్జీల బాదుడు

**మొదటిపేజీ తరువాయి**

రియాలిటీ చూస్తే ప్రయాణికుల జేబులకు భారీగా చిల్లు పడుతోంది. ఫెస్టివల్ టైంలో ఇంటికి చేరాలనే సామాన్యుల ఎమోషన్‌ను క్యాష్ చేసుకునేలా రవాణా శాఖ బిహేవ్ చేస్తోందన్న విమర్శలు విపరీతంగా వస్తున్నాయి. బస్సుల సంఖ్యను పెంచడం మంచి నిర్ణయమే అయినప్పటికీ, ఆ పేరుతో టికెట్ ధరలను అమాంతం పెంచేయడం ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ప్రతి ఏడాది పండుగల వేళ ఇలాంటి ప్రైస్ హైక్ నిర్ణయాలు తీసుకోవడం వల్ల సొంతూళ్లకు వెళ్లే మిడిల్ క్లాస్ పీపుల్, బ్యాచిలర్స్, వర్కింగ్ ప్రొఫెషనల్స్ మీద భరించలేని ఆర్థిక భారం పడుతోంది. హైదరాబాద్ నుంచి కరీంనగర్ రూట్‌ను రియల్ ఎగ్జాంపుల్ గా తీసుకుంటే రెగ్యులర్ రోజుల్లో టికెట్ ప్రైస్ దాదాపు రూ.290 మాత్రమే ఉంటుంది. పండుగ స్పెషల్ బస్సుల పేరుతో 1.5 రెట్ల నిబంధనను తెరపైకి తెచ్చి టికెట్‌పై అదనంగా రూ.100 నుంచి రూ.150 వరకు భారీగా వసూలు చేస్తున్నారు. మెట్రో డీలక్స్ స్పెషల్ బస్సుల్లో అయితే ఈ ఛార్జీ ఏకంగా రూ.400 క్రాస్ అయిపోతోంది. సూపర్ లగ్జరీ సర్వీసుల్లో కూడా సేమ్ ఇదే తరహా దోపిడీ కనిపిస్తోంది. ప్రైవేట్ క్యాబ్స్, యాప్స్ లో కనిపించే డైనమిక్ 'సర్జ్ ప్రైసింగ్' లాగానే ఆర్టీసీ కూడా ఎలాంటి లాజిక్ లేకుండా ఛార్జీలు పెంచుతోందని ప్రజలు ఓపెన్ గా మండిపడుతున్నారు. సాధారణ సమయాల్లో బడ్జెట్ ఫ్రెండ్లీగా ఉండే గవర్నమెంట్ బస్సుల్లో సైతం ఈ రేంజ్ లో రేట్లు పెంచడం వల్ల సాధారణ ప్రజల ఫెస్టివల్ ప్లానింగ్ మొత్తం పూర్తిగా తారుమారవుతోంది. ప్రభుత్వం నుంచి రీజనబుల్ ఫేర్స్ ఎక్స్ పెక్ట్ చేసే సామాన్యులకు ఇది ఊహించని పెద్ద షాక్ ఇస్తోంది. బస్టాండులో బస్సు ఎక్కే వరకు ఒక రకమైన ఇన్ఫర్మేషన్ ఉంటే, జర్నీ స్టార్ట్ అయ్యాక అసలు సమస్య మొదలవుతోంది. సీట్లలో కూర్చున్న తర్వాత కండక్టర్లు అదనపు ఛార్జీలు డిమాండ్ చేస్తుండటంతో ప్యాసింజర్స్ తీవ్ర అసహనానికి గురవుతున్నారు. ఈ అన్యాయాన్ని క్వశ్చన్ చేస్తే సిబ్బంది నుంచి ఎలాంటి క్లారిటీ లేని రూడ్ సమాధానాలు వస్తున్నాయి. హెడ్ ఆఫీస్ నుంచి వచ్చిన ఆర్డర్స్ ప్రకారమే రేట్లు పెంచామని చెప్పి ప్రయాణికులను తీవ్ర ఇబ్బందుల్లోకి నెడుతున్నారు. టైంకి ఊరు చేరుకోవడం తప్పనిసరి కావడంతో ప్రయాణికులు వేరే ఆప్షన్ లేక అడిగినంత మనీ పే చేసి సైలెంట్ గా ట్రావెల్ చేయాల్సి వస్తోంది. డిజిటల్ పేమెంట్స్, టికెటింగ్ మెషిన్లలో ముందుగానే నిర్దిష్ట ఛార్జీల వివరాలు సరిగ్గా అప్డేట్ చేయకపోవడం వల్ల సీట్ల దగ్గర కండక్టర్లతో వాగ్వాదాలు రెగ్యులర్ గా జరుగుతున్నాయి. ప్రయాణం మొదట్లోనే ఇలాంటి గొడవలు జరగడం వల్ల ప్రయాణికులకు జర్నీ ఒక పెద్ద మెంటల్ స్ట్రెస్‌లా మారుతోంది. స్పెషల్ బస్సుల పేరుతో జరుగుతున్న ఈ గందరగోళంలో జర్నలిస్టులకు, స్టూడెంట్స్ కి ఇచ్చే అధికారిక రాయితీలు పూర్తిగా పక్కన పెట్టేస్తున్నారు. రెగ్యులర్ బస్సుల్లో పని చేసే పాసులు, కన్సెషన్స్ ఈ స్పెషల్ సర్వీసులలో అసలు వర్తించవని తేల్చి చెప్పేస్తున్నారు. టికెట్ మిషన్లలో సంబంధిత 'ఆప్షన్ కనిపించడం లేదు' అంటూ సిబ్బంది చాలా కేర్ లెస్ గా సమాధానాలు ఇస్తూ ఉంటారు. ఇది టెక్నికల్ ఇష్యూ వల్ల జరిగిందా లేక కలెక్షన్స్ పెంచుకోవడానికి కావాలనే చేశారా అనేది ఎవరికీ అర్థం కావడం లేదు. గవర్నమెంట్ ప్రొవైడ్ చేసిన రూల్స్ ప్రకారం అర్హులైన వర్గాలకు దక్కాల్సిన బెనిఫిట్స్ ను రద్దీ పేరుతో ఎగ్గొట్టడం ఎంతమాత్రం కరెక్ట్ కాదు. గ్రౌండ్ లెవెల్ లో ఆర్టీసీ హైయర్ అఫీషియల్స్ పర్యవేక్షణ పూర్తిగా లోపించడం వల్లే బస్టాండ్లలో సిబ్బంది తమ ఇష్టానుసారంగా రూల్స్ మారుస్తూ ఇలాంటి ఆర్బిట్రరీ నిర్ణయాలు తీసుకుంటున్నారు. దీనివల్ల రెగ్యులర్ గా బస్సుల్లో తిరిగే వాళ్లకు తీవ్రమైన అన్యాయం జరుగుతోంది. ప్రజా రవాణా వ్యవస్థ అనేది ప్రజలకు సేఫ్, అఫోర్డబుల్ ప్రయాణాన్ని అందించడానికి ఉద్దేశించిన ఒక పబ్లిక్ సర్వీస్ నెట్‌వర్క్. ప్రైవేట్ ట్రావెల్స్ ఫెస్టివల్స్ టైంలో ఇష్టారీతిన రేట్లు పెంచితే కంట్రోల్ చేయాల్సిన పబ్లిక్ సెక్టారే స్వయంగా దోపిడీకి పాల్పడటం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. రద్దీని క్లియర్ చేయడానికి ఎక్స్‌ట్రా ట్రిప్పులు వేయడం మంచిదే అయినా, రిటర్న్ జర్నీలో బస్సులు ఖాళీగా వస్తాయనే కారణంతో ప్రయాణికులపై డబుల్ భారం వేయడం ఎంతమాత్రం యాక్సెప్ట్ చేయలేం. ఉచిత ప్రయాణ పథకాలు అమలు చేస్తున్నామని ప్రచారం చేసుకుంటూనే, మరోవైపు ఇలా స్పెషల్ బస్సుల పేరుతో పేద ప్రజల నుంచి అదనపు డబ్బులు గుంజడం వల్ల ప్రయాణికుల్లో తీవ్రమైన వ్యతిరేకత కనిపిస్తోంది. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ పట్ల ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని ఈ కమర్షియల్ మైండ్‌సెట్ పూర్తిగా దెబ్బతీస్తోంది. గవర్నమెంట్ సర్వీస్ లో కమర్షియల్ ప్రాఫిట్స్ కంటే ప్రజల సౌకర్యానికే ఫస్ట్ ప్రయారిటీ ఉండాలి. పండుగల వేళ ఫ్యామిలీతో కలిసి టైం స్పెండ్ చేయాలనుకునే ప్రతి ఒక్కరికీ ప్రయాణం ఈజీగా, కూల్ గా సాగాలి తప్ప జేబులకు బ్రేక్ వేసే ఆర్థిక భారంగా మారకూడదు. ప్రత్యేక సర్వీసుల రూల్స్, కచ్చితమైన ఛార్జీల వివరాలను ముందుగానే అధికారిక వెబ్‌సైట్లలో, టికెట్ కౌంటర్లలో పారదర్శకంగా ప్రదర్శించాలి. ఎలాంటి గుట్టుచప్పుడు కాకుండా టికెట్ రేట్లు పెంచే విధానాలను వెంటనే ఆపేయాల్సిన బాధ్యత ఆర్టీసీ మేనేజ్‌మెంట్‌పై ఉంది. ఉన్నతాధికారులు గ్రౌండ్ రియాలిటీని వెంటనే రివ్యూ చేసి సామాన్యులను దోచుకునే ఈ 'సర్జ్ ప్రైసింగ్' విధానాన్ని రద్దు చేయాలి. ప్రజల ఇబ్బందులను అర్థం చేసుకుని రాబోయే రోజుల్లో అన్ని స్పెషల్ బస్సులను రెగ్యులర్ ఛార్జీలతోనే నడపాలి. అప్పుడే పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ నిజమైన ప్రజా రవాణాగా నిలబడుతుంది, సామాన్యుడి ఫెస్టివల్ జర్నీ నిజంగా హ్యాపీగా మారుతుంది.




## అన్నా చెల్లెలి అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ



**దేవరుప్పుల, విశాల భారతి:** మండలంలోని అన్ని గ్రామాల్లో రాఖీ పౌర్ణమి పండుగను శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అన్నా చెల్లెలి అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ సందర్భంగా అక్కాచెల్లెళ్లు తమ సోదరులకు రాఖీలు కట్టి, వారి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. సోదరులు తమ అక్కాచెల్లెళ్లకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రేమాభిమానాలతో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రాఖీ పౌర్ణమి పండుగ అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, ఆత్మీయత, అనురాగం, అనుబంధాలను మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. కుటుంబ బంధాలను, భారతీయ సంప్రదాయాలను ప్రతిబింబించే ఈ పండుగను ప్రతి ఒక్కరూ సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. గ్రామాల్లో చిన్నారుల నుంచి పెద్దల వరకు రాఖీ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొనడంతో పండుగ వాతావరణం నెలకొంది.

## దేవన్నకు రాఖీ కట్టిన అక్క.. ఆత్మీయతకు ప్రతీకగా రక్షాబంధన్





**కురవి, విశాల భారతి:** మహబూబాబాద్ జిల్లా కురవి మండలం బంచరాయితండ గ్రామ పంచాయతీలో రాఖీ పౌర్ణమి వేడుకలు కుటుంబ ఆత్మీయతకు, అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కాచెల్లెళ్లు తమ సోదరుడు దేవేందర్ (దేవన్న) కు రాఖీ కట్టి, ఆయన ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. రాఖీ పండుగ సందర్భంగా అక్కాచెల్లెళ్ల నుంచి రాఖీ కట్టించుకున్న దేవన్న వారిని ఆప్యాయంగా పలకరించి, బహుమతులు అందజేశారు. సోదరీమణుల పట్ల ఎల్లప్పుడూ అన్నగా అండగా నిలుస్తానని, వారి కష్టసుఖాల్లో తోడుగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా దేవన్న మాట్లాడుతూ.. రాఖీ అనేది కేవలం ఒక నూలు దారం కాదని, అన్నాచెల్లెళ్ల మధ్య ఉన్న ప్రేమ, ఆప్యాయత, నమ్మకం, రక్షణకు ప్రతీక అని అన్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేస్తూ ప్రతి ఏడాది రాఖీ పండుగ కుటుంబ సభ్యులందరినీ మరింత దగ్గర చేస్తుందని పేర్కొన్నారు. బంచరాయితండలో జరిగిన ఈ రాఖీ వేడుకల్లో కుటుంబ సభ్యుల మధ్య ప్రేమానురాగాలు వెల్లివిరిశాయి. అక్కాచెల్లెళ్లు, అన్నదమ్ముల మధ్య ఉన్న అనుబంధం మరింత బలపడాలని, ఈ పవిత్ర బంధం తరతరాలకు కొనసాగాలని అందరూ ఆకాంక్షించారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా దేవన్నకు రాఖీ కట్టిన అక్కాచెల్లెళ్లతో పాటు కుటుంబ సభ్యులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## రాంబోజిగూడెంలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ

**దేవరుప్పుల, విశాల భారతి:** దేవరుప్పుల మండలం రాంబోజిగూడెం గ్రామపంచాయతీలో శుక్రవారం కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్హులైన లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పరిదుల ధనలక్ష్మి భాస్కర్, ఉపసర్పంచ్ మేడ కొండయ్య, ములుగురి రమేష్, మేడ రేణుక, రాంపల్లి పుష్ప, గ్రామ పంచాయతీ కార్యదర్శి, గ్రామ వీఆర్ఓ, గ్రామ బీసీసీఎల్ అధ్యక్షుడు ములుగురి సంతోష్ గౌడ్, రాంపల్లి యాదగిరి, మేడ నరసయ్య, మేడ కొండయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం అర్హులైన పేద కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులను అందించడం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను మరింత సులభంగా పొందే అవకాశం కల్పిస్తోందని అన్నారు. రేషన్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు.





## ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు

- **మేజర్ ధ్యాన్‌చంద్‌కు ఘన నివాళి**
- **క్రీడలతోనే క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన జీవనం**
- **జిల్లా యువజన, క్రీడల అధికారి డా. ఓ. జ్యోతి**

**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి:** స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆదేశాల మేరకు "ఖేలేగా భారత్ - జీతేగా భారత్" నినాదంతో నిర్వహిస్తున్న మూడు రోజుల జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు శుక్రవారం మహబూబాబాద్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని టి.జి.ఎం.ఆర్.ఎస్ బాలుర పాఠశాల-1లో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. భారత హాకీ దిగ్గజం, హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి జిల్లా యువజన, క్రీడల అధికారి డా. ఓ. జ్యోతి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డా. ఓ. జ్యోతి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. క్రీడల్లో చురుగ్గా పాల్గొనడం వల్ల క్రమశిక్షణ, క్రీడా స్ఫూర్తి, ఆత్మవిశ్వాసంతో పాటు శారీరక, మానసిక దృఢత్వం పెంపొందుతాయని తెలిపారు. ఆరోగ్యకరమైన జీవన విధానానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. విద్యార్థులు క్రీడలను కేవలం వినోదంగా కాకుండా కెరీర్‌గా ఎంచుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులకు సరైన ప్రోత్సాహం, శిక్షణ అందితే దేశానికి మంచి పేరు తీసుకురాగలరని అన్నారు. మేజర్ ధ్యాన్‌చంద్ వంటి క్రీడా దిగ్గజాల జీవితాలను ఆదర్శంగా తీసుకుని యువత క్రీడా రంగంలో ముందుకు సాగాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, క్రీడా సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న జాతీయ క్రీడా దినోత్సవ వేడుకల్లో భాగంగా వివిధ క్రీడా కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

## చిన్నకొండూరులో కలకలం, దేపోని చెరువు వద్ద చెట్ల నరికివేతపై విచారణకు డిమాండ్





**చౌటుప్పల్, విశాల భారతి:**

పర్యావరణ పరిరక్షణలో భాగంగా "చెట్లు నాటండి పచ్చదనాన్ని పెంచండి" అని ప్రభుత్వం పిలుపునిస్తుంటే, యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం చిన్నకొండూరు గ్రామంలో అందుకు భిన్నమైన ఘటన చోటుచేసుకుందనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. గ్రామ పరిధిలోని దేపోని చెరువు వద్ద రూ.లక్షల విలువైన చెట్లను విచక్షణారహితంగా నరికివేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

**పంచాయతీ తీర్మానం పేరుతోనేనా?**

చెరువు పరిధిలో ఉన్న చెట్లను తొలగించేందుకు అటవీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖల నుండి చట్టబద్ధమైన అనుమతులు తీసుకున్నారా? అనేది గ్రామస్తుల ప్రధాన ప్రశ్న. ప్రశ్నించిన వారికి "పంచాయతీలో తీర్మానం చేశాం, చట్టపరంగా ఏమైనా చేసుకోండి" అని బాధ్యులు సమాధానం ఇస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. కేవలం పంచాయతీ తీర్మానంతో ప్రజా ఆస్తి అయిన చెట్లను నరికేయవచ్చా? అని వారు నిలదీస్తున్నారు.

**లక్షల విలువైన కలప ఏమైంది?**

ఇప్పటివరకు ఎన్ని చెట్లు నరికారు? నరికిన కలప ఎక్కడికి తరలించారు? దీనికి సంబంధించి ఎలాంటి రికార్డులు నిర్వహించారు? అనే విషయాలపై పూర్తి స్థాయి విచారణ జరపాలని గ్రామస్తులు, పశుపోషకులు డిమాండ్ చేస్తున్నారు. దీని వెనుక లక్షల విలువైన ప్రజా ఆస్తి చేతులు మారినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**విలేకరికి బెదిరింపులు**

క్షేత్రస్థాయిలో వివరాలు సేకరిస్తున్న విలేకరికి ఫోన్ ద్వారా బెదిరింపులు వచ్చినట్లు ఆరోపణలు రావడం పరిస్థితిని మరింత తీవ్రతరం చేస్తోంది. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశంపై మీడియాను బెదిరించే ధోరణి సరికాదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**గ్రామస్తుల డిమాండ్**

ఈ ఘటనపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, ఘటనా స్థలంలో పంచనామా నిర్వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


1. నిబంధనలు ఉల్లంఘించి చెట్లు నరికినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.
2. మిగిలి ఉన్న చెట్లను వెంటనే సంరక్షించాలి.

ఈ వ్యవహారంపై మునుగోడు ఎమ్మెల్యే స్పందించి నిష్పక్షపాత విచారణకు ఆదేశించాలని చిన్నకొండూరు గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

"ప్రభుత్వం చెట్లు నాటమంటుంటే, ప్రభుత్వ పరిధిలోని చెట్లే నరికివేయబడుతుంటే బాధ్యత ఎవరిది?" అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

## అన్న చెల్లెల అక్క తమ్ముల ప్రేమకు ప్రతి రూపమే రాఖీ పౌర్ణమి

**రాఖీ అంటే ఒక చేతికి కట్టే దారం కాదు.. అన్నా అంటే ఒక ధైర్యం తమ్ముడు అంటే ఒక భరోసా**



**విశాలభారతి , గూడూరు:** మండల పరిధిలోని పలు గ్రామాలలో తెలుగు సంస్కృతికి ప్రతీకగా అన్నా తమ్ముడు అక్క చెల్లెల ప్రేమ రక్త సంబంధమే రాఖీ పండుగ యొక్క ముఖ్య ప్రాముఖ్యత గా చెప్పుకోవచ్చు సమాజం ఆడపిల్లల ఒక శ్రీ శక్తిగా అమ్మగా అక్కగా చెల్లిగా రూపాలను ధరించి సమాజం యొక్క పురోగతికి పునాదిగా చెప్పుకోవచ్చు అలాంటి ఆడపిల్లలను ఈ రోజుల్లో కిరాతకంగా చిన్న చూపుగా చూడడం వలన ప్రేమానురాగాలు రక్త సంబంధాలు సాంప్రదాయ సంస్కృతులు తల్లిదండ్రులు పిల్లల ఎడ్యుకేషన్ తో పాటు ప్రేమ యొక్క విలువలు కుటుంబం యొక్క విలువలు తెలియ చెప్పాలి అప్పుడే ఈ యొక్క అన్నదమ్ముల ప్రేమానురాగాలు అక్క చెల్లెల ఆప్యాయత గౌరవం తెలుగుదనానికి ఉట్టిపడేలా రాఖీ పండుగను గౌరవిస్తూ ఏ చోట ఉన్న అన్న చెల్లెల యొక్క బంధాన్ని వయసుతో సంబంధం లేకుండా చిన్న పెద్ద ముసలి ముతక గుర్తుచేసే ఒక సాంప్రదాయ కలయికే ఈ రాఖీ పండుగ

## చౌటుప్పల్లో ఘనంగా రాఖీ పండుగ వేడుకలు

- **ఆకుల ఇంద్రసేనారెడ్డికి రాఖి కట్టిన పెద్దగొని మౌనిక గౌడ్**
- **అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ**
- **ఆకుల ఇంద్రసేనారెడ్డి వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్**



**చౌటుప్పల్ విశాల భారతి:** రాఖీ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో సోదరభావాన్ని చాటే వేడుకలు ఘనంగా జరిగాయి. చౌటుప్పల్ & నారాయణపురం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి దంపతుల నివాసంలో రాఖీ వేడుకలు అభిమానపూర్వకంగా జరిగాయి. కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ప్రతినిధి పెద్దగోని మౌనిక ఇంద్రసేనారెడ్డి దంపతులకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మిఠాయిలు తినిపించి, వారు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు .ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డి దంపతులు మాట్లాడుతూ "రాఖీ పండుగ అనేది అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక. మా చెల్లెలు మౌనిక మా ఇంటికి వచ్చి రాఖీ కట్టడం చాలా సంతోషంగా ఉంది" అని అన్నారు. మౌనిక మాట్లాడుతూ అన్నా వదినల ఆశీర్వాదం తనకు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

## రిటైర్డ్ ఉపాధ్యాయులు ఎర్రంరెడ్డి ఇంద్రసేనారెడ్డికి ఘన నివాళి



**దేవరుప్పుల, విశాల భారతి:** కడవెండి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయులు ఎర్రంరెడ్డి ఇంద్రసేనారెడ్డి నిన్న సాయంత్రం మృతి చెందారు. విషయం తెలుసుకున్న దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దావెర అనిల్ కుమార్ శుక్రవారం కడవెండి గ్రామానికి వెళ్లి ఇంద్రసేనారెడ్డి పార్థివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇంద్రసేనారెడ్డి ఉపాధ్యాయుడిగా అందించిన సేవలను ఈ సందర్భంగా పలువురు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, కడవెండి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొని ఇంద్రసేనారెడ్డికి నివాళులర్పించారు. ఇంద్రసేనారెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని నాయకులు ప్రార్థించారు.

## పాలకుర్తి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రాఖీ వేడుకలు



**దేవరుప్పుల, విశాల భారతి:** పాలకుర్తి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రాఖీ పౌర్ణమి వేడుకలు ఆత్మీయంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకుర్తి ఎమ్మెల్యే శ్రీమతి మామిడాల యశస్విని రెడ్డి దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులకు రాఖీలు కట్టి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులతో ఆత్మీయంగా ముచ్చటించారు. పార్టీ నాయకులు ఎమ్మెల్యేకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ ప్రేమ, ఆత్మీయత, అనురాగానికి ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దావెర అనిల్ కుమార్తో పాటు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాషింగ్ మిషన్ నుంచి చెలరేగిన మంటలు.. తప్పిన పెను ప్రమాదం!

**అగ్నిమాపక వాహనం ఆలస్యంపై స్థానికుల తీవ్ర ఆగ్రహం!**

**రాజేంద్రనగర్, విశాల భారతి:** మణికొండ-పుప్పాలగూడ పరిధిలోని గోల్డెన్ టెంపుల్ సమీపంలో ఓ ఇంట్లో శుక్రవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. తిరుమల హిల్స్ రోడ్ నంబర్ 11లోని ఓ ఇంట్లో వాషింగ్ మిషన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్రమంగా మంటలు ఇంట్లోని ఫర్నిచర్, ఇతర సామాగ్రికి వ్యాపించడంతో కొంతమేర ఆస్తి నష్టం సంభవించింది. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. అయితే అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకునేందుకు సుమారు 55 నిమిషాల సమయం పట్టిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మణికొండ ప్రాంతం గచ్చిబౌలి ఫైర్ స్టేషన్ పరిధిలోకి వస్తుండటంతో ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ నుంచి అగ్నిమాపక వాహనం రావాల్సి వచ్చిందని స్థానికులు పేర్కొన్నారు. అగ్నిప్రమాదం సంభవించిన సమయంలో పరిధులు, సరిహద్దుల కంటే ప్రజల ప్రాణాలను కాపాడటం, మంటలను వీలైనంత త్వరగా అదుపులోకి తీసుకురావడం అత్యంత ముఖ్యమని స్థానికులు అభిప్రాయపడ్డారు. మణికొండ-పుప్పాలగూడ ప్రాంతంలో పెరుగుతున్న జనాభా, విస్తరిస్తున్న నివాస ప్రాంతాలను దృష్టిలో ఉంచుకుని సమీపంలోనే అగ్నిమాపక సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

## ఒక్కరోజు జ్వరంతో వ్యక్తి మృతి



**వాజేడు ఆగస్టు 28 విశాల భారతి:** మండల పరిధి పేరూరు గ్రామపంచాయతీలో ఒక్కరోజు జ్వరంతో రాంపురం గ్రామానికి చెందిన బొల్లె లక్ష్మణ్( 46) హఠాత్తుగా మృతి చెందాడు. వాజేడు మండలం పేరూరు గ్రామపంచాయతీ పరిధి రాంపురం గ్రామంలో బొల్లె లక్ష్మణ్ అనే వ్యక్తి ఒక్కరోజు జ్వరంతో బాధపడుతూ స్థానిక ఆర్ఎంపీ డాక్టర్ వద్ద వైద్యం చేయించి ఇంటికి తీసుకొచ్చిన కొంత సమయంలో మృతి చెందడంతో భార్య చంద్రమ్మ, ఇద్దరు పిల్లలు ఏడుస్తున్నారు. ముందు రోజు ఇంటి వద్ద మిర్చి నార్మడిలో రోజంతా పనిచేసే ఉదయాన్నే జ్వరం గా ఉందని కుటుంబ సభ్యులకు తెలియజేయగా ధర్మారం ఆర్ఎంపీ డాక్టర్ వద్ద వైద్యం చేయించింది తిరిగి ఇంటికి తీసుకొచ్చిన కొద్ది సమయంలో లక్ష్మణ్ హఠాత్తుగా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు మరియు బంధువులు కన్నీరు మున్నీరై ఏడుస్తున్నారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# 365 జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన

**భూక్య భాస్కర్ మృతి**



**విశాల భారతి ఆగస్టు28గూడూరు:** 2108 2026 సాయంత్రం డీసీఎం వాహనం-బైక్ ప్రమాదంలో గాయపడిన బుక్యా భాస్కర్ (40), తండ్రి: మాన్యా, లంబాడా కులం, కూలీ, నివాసం: ముత్తాయలమ్మ తండా, గుండెంగా, వరంగల్ చికిత్స నిమిత్తం హైదరాబాద్ ఆసుపత్రిలో ఉన్నారు. ఆయన పరిస్థితి విషమించడంతో ఎంజీఎం ఆసుపత్రికి తరలిస్తుండగా, సుమారు 11:00 గంటల సమయంలో కాజీపేట సమీపంలో మృతి చెందారు. అనంతరం మృతదేహాన్ని గూడూరు మార్చురీకి తరలించి, పోస్టుమార్టం (పిఎం ఈ) పూర్తి చేసిన తర్వాత బంధువులకు అప్పగించడం జరిగింది.

# జింకలగూడెం వంతెన పై మృత్యుగుంతలు

- **సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ పై నిర్మించిన వంతెన అధ్వానంగా మారింది**
- **వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్న పట్టించుకోని అధికారులు**
- **ఇనుప రాడ్లు బయటకు తేలడంతో వాహనదారుల్లో ఆందోళన**
- **ప్రాణం పోయేంతవరకు పట్టించుకోరా..!**
- **వాహనదారులకు తప్పని ఇబ్బందులు ప్రమాదాల భయం**





**బూర్గంపాడు/ విశాలభారతి :** బూర్గంపాడు మండల పరిధిలోని జింకలగూడెం వద్ద సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ పై నిర్మించిన వంతెన అధ్వానంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వంతెలపై ఏర్పడిన పెద్ద గుంతలతో పాటు ఇనుప రాడ్లు బయటకు తేలి కనిపిస్తుండటంతో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో గుంతల కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు వాపోతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో గుంతలు స్పష్టంగా కనిపించకపోవడంతో ద్విచక్ర వాహనదారులు మరింత ఇబ్బందులు పడుతున్నారు. గతంలో తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టిన సమస్య మళ్ళీ పునరావృతం అవుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వంతెన పై ఉన్న గుంతలను పూర్తిగా పూడ్చడంతో పాటు బయటకు తేలిన ఇనుప రాడ్లను తొలగించి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

# శివాలయంలో ఘనంగా సామూహిక గాయత్రీ ధారణ మహోత్సవం



**చిట్యాల,విశాల భారతి:** రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని చిట్యాల శివాలయంలో శుక్రవారం సామూహిక గాయత్రీ ధారణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. స్థానిక భక్త మార్కండేయ పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ వేడుకను నిర్వహించారు. అర్చకులు దౌలతాబాద్ వాసుదేవ శర్మ శాస్త్రోక్తంగా గాయత్రీ పూజను నిర్వహించి, యజ్ఞోపవీత విశిష్టతను భక్తులకు వివరించారు. పద్మశాలి కులస్తులు పెద్ద సంఖ్యలో హాజరై గోత్రనామాలతో ప్రత్యేక అర్చనలు చేయించుకుని, నూతన యజ్ఞోపవీతాలను ధరించారు. అనంతరం రాఖీ వేడుకను జరుపుకున్నారు. కార్యక్రమం అనంతరం నిర్వాహకులు భక్తులకు మిఠాయిలు, ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు జెల్ల మనోహర్, ప్రధాన కార్యదర్శి గంజి వెంకటేశం, పున్న పాండుజీ, జెల్ల సత్తయ్య, గంజి సుధాకర్, చేపూరి శ్రీనివాస్, వలకీర్తి రమేష్, రాపోలు లక్ష్మయ్య, గంజి కృష్ణయ్య, చెరుపల్లి శ్రీనివాస్, గంజి గోవర్ధన్, కస్తూరి కృష్ణమోహన్, తడక మురళి, డా. కోట దయాకర్ తదితర కుల బాంధవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రసాయన సాగుకు స్వస్తి పలకాలి

- **సేంద్రియ పద్ధతుల వైపు రైతులు అడుగులు వేయాలి**
- **తక్కువ నీటితో పండే పంటలపై దృష్టి సారించాలి:ఆత్మ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి.**



**సీరోల్ విశాల భారతి:** రసాయన ఎరువులు, పురుగుమందులను అధిక మోతాదులో వినియోగించకుండా రైతులు సేంద్రియ పద్ధతుల్లో సాగు చేపట్టాలని ఆత్మ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి సూచించారు. సీరోల్ మండలం కాంపల్లి రైతు వేదికలో ఆత్మ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు అవగాహన సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నల్లు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో చెరువులు, కుంటల్లో నీటి లభ్యత తగ్గిపోయిందన్నారు. భూగర్భజలాలు రోజురోజుకూ అడుగంటిపోతున్నాయని, జలాశయాల నుంచి సాగునీరు అందే పరిస్థితులు కూడా అంతంతమాత్రంగానే ఉన్నాయని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు వరి సాగును తగ్గించుకుని తక్కువ నీటితో సాగు చేయగల పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాలు, కూరగాయల పంటలపై దృష్టి సారించాలని కోరారు. పదేళ్ల క్రితం ఎకరా వరి సాగుకు సుమారు 80 కిలోల యూరియా వినియోగించగా, ప్రస్తుతం అదే సాగుకు దాదాపు 150 కిలోల వరకు యూరియా వినియోగిస్తున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. రసాయన ఎరువుల వినియోగం పెరుగుతున్న కొద్దీ సాగు పెట్టుబడులు కూడా గణనీయంగా పెరుగుతున్నాయని తెలిపారు. గత పదేళ్లలో సాగు పెట్టుబడులు 12 నుంచి 15 శాతం పెరిగినా, రైతుల ఆదాయం మాత్రం కేవలం 4 నుంచి 5 శాతం మాత్రమే పెరిగిందని వివరించారు. రైతులు ఈ పరిస్థితిని గమనించి రసాయన ఎరువులు, పురుగుమందులను విచ్చలవిడిగా వినియోగించకుండా సేంద్రియ ఎరువులతో ప్రకృతి ఆధారిత సాగు విధానాలను అవలంబించాలని సూచించారు. సేంద్రియ పద్ధతుల ద్వారా సాగు పెట్టుబడులను తగ్గించడంతో పాటు నాణ్యమైన పంటలను ఉత్పత్తి చేసి అధిక లాభాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. అదేవిధంగా పంట మార్పిడి విధానాన్ని పాటించడం ద్వారా భూసారాన్ని పరిరక్షించుకోవచ్చని తెలిపారు. ఒకే రకమైన పంటపై ఆధారపడకుండా వైవిధ్యమైన పంటలను సాగు చేయడం వల్ల రైతులకు మాత్రమే కాకుండా సమాజానికి కూడా ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులు అందించే సూచనలు, సాగు మెలకువలను రైతులు తప్పనిసరిగా పాటించాలని, ఆధునిక వ్యవసాయ పద్ధతులను అందిపుచ్చుకుని సాగును లాభసాటిగా మార్చుకోవాలని నల్లు సుధాకర్ రెడ్డి కోరారు.

**రైతులకు శాస్త్రీయ అవగాహన అవసరం.**

మండల వ్యవసాయ అధికారి చాయారాజ్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో సాంకేతిక ఏఓ శ్రీదేవి, ఏఓ వాహిని, సర్పంచ్ రేపాకుల యల్లమ్మ, ఏఈఓలు భరత్, సురేష్, కరుణాకర్ రెడ్డి, రైతులు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


# పేద గుండెకు ఎమ్మెల్యే రామచంద్రు నాయక్ అండ

- **గుండె ఆపరేషన్‌కు రూ.5 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు**
- **ఆపదలో ఉన్న కుటుంబానికి ఆర్థిక భరోసా**
- **ప్రత్యేక చొరవతో ఎల్‌ఓసీ సాధించిన ఎమ్మెల్యే**

**సీరోల్, విశాల భారతి:**







Dr. JATOTH RAMCHANDER NAIK
M.L.A., Dornakal-(101)
GOVERNMENT WHIP
Telangana Legislative Assembly

Office : 3rd Floor,
Assembly Buildings
Public Gardens, Nampally,
Hyderabad - 500 004
Mobile : 9866544599

Lr.No. LOC/234/13166/MLA-Drkl-104/GWTLA/2025 -Dated: 28-08-2026

To
The Hon'ble Chief Minister,
Government of Telangana,
Hyderabad.

Respected Sir,

Sub: -Chief Minister's Relief Fund – Issue of LOC –Requested – Reg.

I humbly submit that, the representation of the following person is enclosing for sanction of L.O.C. from Chief Minister's Relief Fund. The details are as follows.

| Name & Address | Disease | Name of the Hospital | Estimated Amount & Remarks |
| --- | --- | --- | --- |
| Jatothu Lakshmi, Female, 45 years, Gujli Thanda, Chintapalli, Kuravi, Mahabubabad, Aadhar No.602287113697, RC No.369280103040, Mobile:9885945612, Token No.13166/TLOC/2026, CR No.331012600788645 | Cardio Vascular & Thoracic Surgery Dept.- CRHD, Severe MS – Advised MVR with 25mm Meril Miltonia | Nizam's Institute of Medical Science (NIMS) Hyderabad | Rs. 5,00,000/- |

The above person is belongs to poor and I request the Honourable Chief Minister to kindly sanction the LOC in favour of NIMS Hospital, Hyderabad for the treatment of the above individual.

Thanking You,

Yours Sincerely,

(DR.JATOTH RAMCHANDER NAIK)

Camp Office: Village & Mandal Maripeda (Bangla), District: Mahabubabad-506315,

పేద కుటుంబం గుండె సంబంధిత వ్యాధితో అల్లాడుతున్న వేళ డోర్నకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రు నాయక్ అండగా నిలిచారు. ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్సకు వెనుకడుగు వేయాల్సిన పరిస్థితి రాకుండా ప్రత్యేక చొరవ తీసుకుని రూ.5 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. సీరోల్ మండలం కొత్తూరు (సి) గ్రామం పరిధిలోని గుజ్జలితండాకు చెందిన జాటోత్ లక్ష్మీ రాందాస్ గుండె సంబంధిత అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గుండెకు ఆపరేషన్ అవసరం కావడంతో భారీగా వైద్య ఖర్చులు అయ్యే పరిస్థితి నెలకొంది. ఒకవైపు అనారోగ్య బాధ.. మరోవైపు వైద్య ఖర్చుల భారం.. దీంతో ఆ కుటుంబం తీవ్ర ఆందోళనకు గురైంది. ఈ పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రు నాయక్ వెంటనే స్పందించి, పేద కుటుంబానికి వైద్య సాయం అందేలా అధికారులతో సమన్వయం చేశారు. ఫలితంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.5 లక్షల విలువైన ఎల్‌ఓసీ మంజూరైంది. శాంక్షన్ లెటర్‌ను లక్ష్మీ రాందాస్ కుటుంబ సభ్యులకు అందజేశారు.

**"పేదవాడి ప్రాణానికి డబ్బు అడ్డంకి కాకూడదు"**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామచంద్రు నాయక్ మాట్లాడుతూ.. "వైద్యం కోసం డబ్బులు లేక ఏ పేదవాడి గుండె ఆగిపోకూడదు. ఆర్థిక స్థోమత లేక చికిత్స పొందలేని పరిస్థితిలో ఉన్న ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది" అని స్పష్టం చేశారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, పేదలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా అర్హులైన కుటుంబాలకు రూ.10 లక్షల వరకు వైద్య సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. అవసరమైన సందర్భాల్లో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా కూడా వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజల కష్టాల్లో ముందుండి స్పందించే ప్రజాప్రతినిధిగా ఎమ్మెల్యే రామచంద్రు నాయక్ మరోసారి తన చొరవను చాటుకున్నారు. రాజకీయాలకు అతీతంగా ఆపదలో ఉన్న పేద కుటుంబానికి వైద్య భరోసా కల్పిస్తూ రూ.5 లక్షల సహాయం అందేలా కృషి చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ కుటుంబం తీవ్ర ఆందోళనలో ఉన్న సమయంలో ఎమ్మెల్యే రామచంద్రు నాయక్ స్పందించి రూ.5 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసీ మంజూరు చేయించడం తమకు కొండంత అండగా నిలిచిందని జాటోత్ లక్ష్మీ రాందాస్ కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# మాదకద్రవ్యాలపై చౌటుప్పల్ పోలీసుల ఉక్కు పాదం

**20కిలోల గంజాయి పట్టివేత,ఇద్దరు అరెస్ట్**

**చౌటుప్పల్,విశాల భారతి:**



అక్రమ గంజాయి రవాణాపై చౌటుప్పల్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఈగల్ ఫోర్స్ సహకారంతో చేపట్టిన తనిఖీల్లో భారీగా గంజాయిని పట్టుకుని ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్లను అరెస్ట్ చేశారు.

**ఘటన వివరాలు:**

చౌటుప్పల్ డీఎస్పీ మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు, ఇన్స్పెక్టర్ జి. మన్మధ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. తేదీ 27 082026 గురువారం యస్ఐ ఎస్. కృష్ణమాల్ కి అందిన పక్కా సమాచారంతో ఎన్ హెచ్ 65 హైదరాబాద్ రోడ్డులోని చౌటుప్పల్ ఎలక్ట్రిక్ సబ్ స్టేషన్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. అనుమానాస్పదంగా వస్తున్న OD02DS897 నంబర్ గల ఫోర్నెక్స్ కారును ఆపి తనిఖీ చేయగా, వెనుక డిక్కీలో బ్రౌన్ టేపుతో చుట్టిన 20 ప్యాకెట్లు బయటపడ్డాయి. తూకం వేయగా మొత్తం 20.360 కిలోల గంజాయి ఉన్నట్లు తేలింది. వెంటనే ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి వద్ద నుండి 3 మొబైల్ ఫోన్లు, గంజాయి తరలింపుకు ఉపయోగించిన ఫోర్నెక్స్ కారును స్వాధీనం చేసుకున్నారు.

**నిందితుల వివరాలు:**

ఏ1 త్రిలోచన్ సామంత్రా (30సం.), ఏ2 సాగర్ బాల్ (23 సం.) ఇద్దరూ రాజ్ నగర్ గ్రామం, కేంద్రపారా జిల్లా, ఒడిశా రాష్ట్రానికి చెందిన వారు. విచారణలో ఒడిశా నుండి తక్కువ ధరకు గంజాయి కొని తెలంగాణలో ఎక్కువ ధరకు అమ్మేందుకు తరలిస్తున్నట్లు, ఇందుకోసం వారికి రూ.50,000 ఆఫర్ ఇచ్చినట్లు ఒప్పుకున్నారు. ఈ ముఠాలో మరికొందరి ప్రమేయంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితులపై ఎన్డిపియస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు. అక్రమ మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపుతున్న చౌటుప్పల్ పోలీసులను పలువురు అభినందిస్తున్నారు.

# రాఖీ పండుగ రోజున పేదలకు సర్కార్ కానుక




**ఇందిరమ్మ టవర్స్ లక్కీడ్రా నిర్వహించిన ప్రకాశ్ గౌడ్**

**రాజేంద్రనగర్, విశాల భారతి :**

ఇల్లు లేని నిరుపేద కుటుంబాల సొంతింటి కలను నిజం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ టవర్స్ కార్యక్రమంలో భాగంగా రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మైలార్‌దేవుపల్లి పరిధి లక్ష్మీగూడలో లక్కీడ్రా నిర్వహించారు. రాఖీ పండుగ రోజున జరిగిన ఈ కార్యక్రమాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ ప్రారంభించారు. అర్హతే ప్రామాణికంగా, కుల, మత, రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా చేపట్టామని ఎమ్మెల్యే తెలిపారు. చిన్నారుల చేతుల మీదుగా లక్కీడ్రా టోకెన్లు తీయించి లబ్ధిదారుల పేర్లను ప్రకటించారు. ఎంపికైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అరుదైన సంఘటన చోటుచేసుకుంది. ఇందిరమ్మ టవర్స్ లక్కీడ్రా టోకెన్‌ను ఓ చిన్నారి తీయగా, అదే చిన్నారి కుటుంబానికే ఇల్లు దక్కడం కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అదృష్టం తమ కుటుంబాన్నే వరించడంతో ఆ కుటుంబ సభ్యుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. దేవుడి ఆశీర్వాదం, ప్రభుత్వ సహకారంతో వారి సొంతింటి కల నెరవేరుతున్నందుకు ఎమ్మెల్యే ఆ చిన్నారిని మనసారా ఆశీర్వదించారు. లక్కీడ్రా అనంతరం లబ్ధిదారుల తుది ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించిన తర్వాత అర్హులైన వారికి ధ్రువపత్రాలు అందజేస్తారని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం మూడు నుంచి నాలుగు రోజుల్లోనే ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ పనులు ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ పనులు కొనసాగుతున్న సమయంలో ఎంపికైన లబ్ధిదారులు ఎప్పుడైనా నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి పనులను పరిశీలించవచ్చని, నిర్మాణ నాణ్యతపై లబ్ధిదారులకు పూర్తి హక్కు ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఇటీవల ఈ నెల 13న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ కాలనీలో ఇందిరమ్మ టవర్స్‌కు శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. కేవలం 15 రోజుల రికార్డు సమయంలోనే 16 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి టెండర్లు పిలవడంతో పాటు, లబ్ధిదారుల ఎంపిక కోసం లక్కీడ్రాలు నిర్వహించడం పేదల సొంతింటి విషయంలో ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎకరం భూమి విలువ వందల కోట్ల రూపాయలు పలికే ప్రాంతాల్లోనూ నిరుపేద కుటుంబాలు ఆత్మగౌరవంతో, గౌరవప్రదంగా జీవించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. పేదవాడికి సొంతింటిని అందించడం కేవలం గృహ నిర్మాణ కార్యక్రమం మాత్రమే కాదని, అది వారి ఆత్మగౌరవానికి ప్రతీక అని ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ పేర్కొన్నారు.

# ఘనంగా అన్నాచెల్లెల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్

**నిజామాబాద్ జిల్లా విశాల భారతి :** మాక్లూర్ మండలం పలు గ్రామాలలో శుక్రవారం ఘనంగా రక్షాబంధన్ వేడుకలు పవిత్రమైన శ్రావణ పౌర్ణమి పురస్కరించుకొని. అక్క తమ్ముళ్లు అన్నా చెల్లెలు ఈ పండగ భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. సోదరీమణులు తమ సోదరులకు తిలకం దిద్ది. రాఖీ కట్టి మిఠాయిలు తినిపిస్తారు. వారి ఆయురారోగ్యాలు. సుఖ సంతోషాలు బాగుండాలని కోరుకుంటారు. సోదరులు సోదరీమణులకు రక్షణకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని మాట ఇస్తూ కానుకలు ఇస్తూ నూతన వస్త్ర నగదు బహుమతి ఇచ్చి ఆశీర్వాదాలు తీసుకుంటారు. అందజేస్తారు. చిన్ననాటి అల్లరి ఆటపాటలు కలిసి పెరిగిన మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ కుటుంబంలో ఆనందంగా గడుపుతారు.



# తీవ్రమైన గుండె జబ్బుతో బాధపడుతున్న వృద్ధురాలికి అరుదైన శస్త్రచికిత్స

**భారీ అండాశయ తిత్తి తొలగింపు**




**సికింద్రాబాద్,విశాల భారతి :** తీవ్రమైన గుండె జబ్బుతో బాధపడుతున్న 69 ఏళ్ల వృద్ధురాలికి సికింద్రాబాద్‌లోని మెడికవర్ ఆసుపత్రి వైద్యులు సంక్లిష్టమైన శస్త్రచికిత్స చేసి భారీ అండాశయ తిత్తిని (ఓవేరియన్ సిస్ట్) విజయవంతంగా తొలగించారు. హైదరాబాద్‌కు చెందిన రోద భాయ్ కడుపులో తీవ్రమైన అసౌకర్యం, ఒత్తిడితో బాధపడుతూ ఆసుపత్రిలో చేరారు. ఆమెను పరీక్షించిన వైద్యులు కడుపులో భారీ పరిమాణంలో తిత్తి పెరిగినట్లు గుర్తించి, శస్త్రచికిత్స అనివార్యమని స్పష్టం చేశారు. అయితే బాధితురాలు తీవ్ర గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతుండటంతో ఆపరేషన్ చేయడం, మత్తుమందు ఇవ్వడం వైద్యులకు పెను సవాలుగా మారింది. పెద్ద స్థాయి కడుపు శస్త్రచికిత్సల సమయంలో గుండెపై తీవ్ర ఒత్తిడి పడే ప్రమాదం ఉండటంతో పాటు మత్తుమందు ప్రభావం వల్ల రక్తపోటు, గుండె స్పందనలు, రక్త ప్రసరణలో తీవ్ర మార్పులు వచ్చే ముప్పును వైద్యులు గుర్తించారు. ఈ అధిక ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని వివిధ విభాగాల నిపుణుల సమన్వయంతో పక్కా ప్రణాళికను రూపొందించారు. గైనకాలజిస్ట్ డాక్టర్ మాధవి దొక్కు నేతృత్వంలో కార్డియాలజిస్ట్ డాక్టర్ ప్రమోద్ కుమార్ కుచులకంటి, అనస్థీషియాలజిస్ట్ డాక్టర్ శ్రీనివాస్ నిరంతరం పర్యవేక్షిస్తూ గుండె స్థితి స్థిరంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకుని ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. సాధారణ పరిస్థితుల్లోనే భారీ అండాశయ తిత్తిని తొలగించడం క్లిష్టమైన విషయమని, గుండె జబ్బు ఉన్న రోగికి ఇలాంటి శస్త్రచికిత్స చేయడం మరింత సవాలుతో కూడుకున్నదని డాక్టర్ మాధవి దొక్కు తెలిపారు. గైనకాలజీ, కార్డియాలజీ, అనస్థీషియా విభాగాల సమిష్టి కృషితోనే ఈ విజయం సాధ్యమైందని, రోగికి పునర్జన్మ లభించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సెంటర్ హెడ్ కృష్ణవేణి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ అన్నకు రాఖీ కట్టిన చిన్నారి అక్షిత

**సోదరభావం, ప్రేమానురాగాలకు ప్రతీక రాఖీ పౌర్ణమి**




**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** రాఖీ పౌర్ణమి సందర్భంగా హయత్‌నగర్‌కు చెందిన ఏడో తరగతి విద్యార్థిని దార్ల అక్షిత తన సోదరుడు హర్షవర్ధన్‌తో కలిసి హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఇన్‌స్పెక్టర్ సీహెచ్. శంకరయ్యకు రాఖీ కట్టి స్వీట్ తినిపించింది. అనంతరం పోలీస్‌స్టేషన్ అడ్మిన్ ఎస్‌ఐ నరసింహకు కూడా రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపింది. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ శంకరయ్య మాట్లాడుతూ.. రాఖీ పౌర్ణమి సోదర-సోదరీమణుల మధ్య ప్రేమ, అనురాగం, నమ్మకం, రక్షణకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. చిన్నారి అక్షిత చూపిన ఆప్యాయత, పెద్దల పట్ల గౌరవం అభినందనీయమని పేర్కొన్నారు.

# విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో ప్రైవేటీకరణపై పోరాటం

- **ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడాన్ని అడ్డుకుందాం:**
- **సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య**

**మహబూబాబాద్:** విద్యుత్ అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఐక్య ప్రజా ఉద్యమాలను నిర్మించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య పిలుపునిచ్చారు. విద్యుత్ ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు ప్రాణత్యాగం చేసిన అమరవీరుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే వారికి అందించే ఘనమైన నివాళి అని అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యాలయంలో విద్యుత్ అమరవీరుల 26వ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. సబ్‌డివిజన్ కార్యదర్శి హేలావత్ లింగ్యా అధ్యక్షతన జరిగిన సభలో గౌని ఐలయ్య మాట్లాడుతూ.. 2000 ఆగస్టు 28న విద్యుత్ ప్రైవేటీకరణ, విద్యుత్ ఛార్జీల పెంపుదల, ప్రైవేటు సంస్థలకు విద్యుత్ వ్యవస్థను అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వామపక్ష పార్టీలు ఇచ్చిన పిలుపుతో భారీ ఉద్యమం సాగిందని గుర్తుచేశారు. అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో భాగంగా బషీర్‌బాగ్ వద్ద జరిగిన ఆందోళనపై పోలీసులు పాశవికంగా కాల్పులు జరపడంతో రామకృష్ణ, విష్ణువర్ధన్, బాలస్వామి తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఆ అమరవీరుల త్యాగాల ఫలితంగానే అప్పటి ప్రభుత్వం వెనక్కి తగ్గి విద్యుత్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని నిలిపివేసిందన్నారు. నేటికీ విద్యుత్ వ్యవస్థ ప్రభుత్వ ఆధీనంలో కొనసాగడానికి ఆ ఉద్యమం కీలక కారణమని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం దేశంలో, రాష్ట్రంలో ప్రభుత్వ రంగ సంస్థలను ఒక్కొక్కటిగా ప్రైవేటు, కార్పొరేట్ శక్తులకు అప్పగించే ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని గౌని ఐలయ్య విమర్శించారు. ప్రజల ఆస్తులుగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెట్టే విధానాలను తీవ్రంగా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. విద్యుత్ ఉద్యమం చూపిన పోరాట మార్గంలో కార్మికులు, ఉద్యోగులు, రైతులు, విద్యార్థులు, ప్రజాసంఘాలు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, ప్రజా ఆస్తుల కాపాడటం కోసం జరిగే ప్రతి పోరాటంలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. విద్యుత్ అమరవీరుల త్యాగాలను కేవలం వర్ధంతి కార్యక్రమాలకే పరిమితం చేయకుండా, వారి ఆశయాల సాధన కోసం నిరంతర ప్రజా ఉద్యమాలను నిర్మించడమే నిజమైన నివాళి అని గౌని ఐలయ్య స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా కార్యదర్శి బట్టు చైతన్య, పీడీఎస్యూ జిల్లా కార్యదర్శి బోనగిరి మధు, ప్రజాసంఘాల నాయకులు తెలబోయిన కృష్ణ, షేక్ షబ్బీర్, ఎస్.కె. పాషా, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టులకు రాఖీ కట్టి.. హెల్మెట్లు అందించిన సత్యవతి రాథోడ్

- జర్నలిస్టుల సంక్షేమంతో పాటు రోడ్డు భద్రతకు ప్రాధాన్యం
- ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని పిలుపు

**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి:**



రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ జర్నలిస్టు సోదరులపై తన కున్న ఆత్మీయతను చాటుకున్నారు. మహబూబాబాద్‌లోని తన స్వగృహంలో జర్నలిస్టులకు స్వయంగా రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. అంతేకాకుండా క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే జర్నలిస్టుల రోడ్డు భద్రతను దృష్టిలో ఉంచుకుని వారికి హెల్మెట్లను చిరుకానుకగా అందజేశారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు నిత్యం వార్తల సేకరణ కోసం జర్నలిస్టులు ద్విచక్ర వాహనాలపై విస్తృతంగా ప్రయాణిస్తుంటారని సత్యవతి రాథోడ్ పేర్కొన్నారు. విధి నిర్వహణలో వారి భద్రత కూడా ముఖ్యమేనని భావించి తన వంతు బాధ్యతగా హెల్మెట్లు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం జర్నలిస్టు మిత్రులకు అల్పాహార విందు ఏర్పాటు చేసి వారితో కలిసి రాఖీ పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ.. జర్నలిస్టులు ప్రజలకు, అధికారులకు, రాజకీయ నాయకులకు మధ్య వారధిగా ఉంటూ ప్రజా సమస్యలను సమాజం దృష్టికి తీసుకువస్తున్నారని అన్నారు. ఎండ, వాన, రాత్రి, పగలు అనే తేడా లేకుండా వార్తల సేకరణ కోసం క్షేత్రస్థాయిలో పనిచేసే జర్నలిస్టుల క్షేమాన్ని ప్రతి ఒక్కరూ కోరుకోవాలని పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లా ఎస్పీ శబరీష్ ఐపీఎస్ జిల్లాను ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దే లక్ష్యంతో రోడ్డు ప్రమాదాల నివారణపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని సత్యవతి రాథోడ్ తెలిపారు. పోలీసులు, అధికారులు ఎంతగా అవగాహన కల్పించినా ప్రజలు స్వయంగా బాధ్యత తీసుకున్నప్పుడే ప్రమాదాలను గణనీయంగా తగ్గించగలమన్నారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణించాలని సూచించారు. హెల్మెట్ కేవలం పోలీసుల భయం కోసం ధరించేది కాదని.. మన ప్రాణాలను, మనపై ఆధారపడిన కుటుంబ సభ్యుల భవిష్యత్తును కాపాడుకోవడానికి ధరించాల్సిన రక్షణ కవచమని ఆమె పేర్కొన్నారు. ప్రమాద సమయంలో తలకు తీవ్రమైన గాయాలు కాకుండా హెల్మెట్ ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సర్పంచ్ ఉప్పల సోమన్న ఘటనను సత్యవతి రాథోడ్ ప్రస్తావించారు. ఆయన హెల్మెట్ ధరించి ఉండి ఉంటే తలకు తీవ్ర గాయం కాకుండా ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం ఉండేదేమోనని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదం ఒక్క వ్యక్తి ప్రాణాన్నే కాదు.. మొత్తం కుటుంబాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టేస్తుందని అన్నారు. తమ కుటుంబంలోనూ రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని మిగిల్చిందని సత్యవతి రాథోడ్ భావోద్వేగానికి గురయ్యారు. తన భర్త కూడా రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందారని పేర్కొంటూ.. ఇలాంటి విషాదం మరే కుటుంబానికీ రాకూడదన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలు పాటించి, హెల్మెట్ ధరించి ప్రయాణిస్తూ తమ ప్రాణాలను, కుటుంబాల భవిష్యత్తును కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. "అందరికీ కాకపోయినా కొందరు జర్నలిస్టు మిత్రులకైనా నా వంతుగా ఈ చిన్న కానుక అందిస్తున్నాను. ప్రజల కోసం నిరంతరం కష్టపడుతూ వార్తలను సేకరించే జర్నలిస్టు సోదరులందరికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు. మీ క్షేమాన్ని కోరుకుంటూ ఈ హెల్మెట్‌ను చిరుకానుకగా అందిస్తున్నాను" అని సత్యవతి రాథోడ్ అన్నారు. జర్నలిస్టుల భద్రతతో పాటు ప్రజల ప్రాణ రక్షణకు హెల్మెట్ వినియోగం ఎంతో కీలకమని ఆమె స్పష్టం చేశారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్న నిర్లక్ష్యం కుటుంబాన్ని జీవితాంతం విషాదంలోకి నెట్టే అవకాశం ఉన్నందున వాహనం నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి సురక్షితంగా ప్రయాణించాలని సత్యవతి రాథోడ్ పిలుపునిచ్చారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాఖీ కట్టిన కళ్లెం సుజాత రెడ్డి

- టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీకి సైతం రాఖీ కట్టి శుభాకాంక్షలు





**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** రాఖీ పండుగ సందర్భంగా మాజీ రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు కళ్లెం సుజాత రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాఖీ కట్టి తన ఆప్యాయతను చాటుకున్నారు. అనంతరం టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, ఎల్బీనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మధు యాష్కీ గౌడ్‌కు కూడా కళ్లెం సుజాత రెడ్డి రాఖీ కట్టి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకుల మధ్య ఆత్మీయ వాతావరణం నెలకొంది. రాఖీ పండుగ అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమానురాగాలు, ఆత్మీయతను మరింత బలోపేతం చేసే పవిత్రమైన పండుగ అని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

## రాఖీ బంధం.. ఆత్మీయ అనుబంధం!

- అన్నాచెల్లెళ్ల ప్రేమానురాగాలకు ప్రతీక రాఖీ పండుగ
- గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** రాఖీ పండుగ సందర్భంగా గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి నివాసంలో అన్నాచెల్లెళ్ల ఆత్మీయత వెల్లివిరిసింది. శుక్రవారం ఉదయం ఆయన సోదరీమణులు మమత రెడ్డి, రూప రెడ్డి సోదరుడికి రాఖీ కట్టి తమ ప్రేమానురాగాలను చాటుకున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యుల మధ్య ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. ఈ సందర్భంగా చిలుక మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. అన్నాచెల్లెళ్ల ఆత్మీయతకు, అక్కాతమ్ముళ్ల ప్రేమానురాగాలకు ప్రతీకగా రాఖీ పండుగ నిలుస్తుందని అన్నారు. రాఖీ పండుగ కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు. ఆడపడుచులందరూ సుఖసంతోషాలతో, ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి ఇంటా రాఖీ పండుగ ఆనందాన్ని నింపాలని, అన్నాచెల్లెళ్ల అనుబంధం ఎల్లప్పుడూ ఇలాగే ప్రేమానురాగాలతో కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు.

## ఖాదర్ బాబాకు రాఖీ కట్టిన మాజీ ఎంపీ మాలోత్ కవిత

- రక్షాబంధన్ వేళ బేతోలులో వెల్లివిరిసిన ఆత్మీయత
- సోదరభావానికి ప్రతీకగా రాఖీ వేడుకలు



**మహబూబాబాద్ జిల్లా, విశాల భారతి:** రక్షాబంధన్ పర్వదినం సందర్భంగా మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బేతోలు గ్రామంలో ఆత్మీయత, సోదరభావం వెల్లివిరిసింది. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని షేక్ ఖాదర్ బాబాకు మాజీ పార్లమెంట్ సభ్యురాలు మాలోత్ కవిత రాఖీ కట్టి సోదర అనుబంధాన్ని చాటుకున్నారు. ఈ ఆత్మీయ వేడుక బేతోలు గ్రామంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా మాలోత్ కవిత, షేక్ ఖాదర్ బాబా పరస్పరం ఆత్మీయంగా పలకరించుకుని రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. రాఖీ కట్టి సోదరభావాన్ని చాటిన మాలోత్ కవితను ఖాదర్ బాబా ఆత్మీయంగా అభినందించారు. ప్రేమ, ఆప్యాయత, పరస్పర గౌరవం, మానవత్వానికి రక్షాబంధన్ పండుగ ప్రతీకగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు. బీఆర్ఎస్ కుటుంబ సభ్యులకు రాఖీలు కట్టిన మాలోత్ కవిత రక్షాబంధన్ వేడుకల్లో భాగంగా బేతోలు గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులతో మాలోత్ కవిత ఆత్మీయంగా మమేకమయ్యారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు తన చేతుల మీదుగా రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించే బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులతో సోదరభావాన్ని పంచుకోవడం సంతోషంగా ఉందని ఆమె అన్నారు. ఈ సందర్భంగా షేక్ ఖాదర్ బాబా మాట్లాడుతూ, రక్షాబంధన్ పండుగ సందర్భంగా మాజీ ఎంపీ మాలోత్ కవిత బేతోలు గ్రామానికి వచ్చి తనకు రాఖీ కట్టడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సోదరభావంతో రాఖీ కట్టి ఆత్మీయతను చాటడం తమ మధ్య ఉన్న అనుబంధానికి ప్రతీకగా నిలిచిందని తెలిపారు. మతాలు, వర్గాలు, ప్రాంతాలకు అతీతంగా ప్రజల మధ్య ప్రేమ, సోదరభావం, ఐక్యత పెంపొందించడమే రక్షాబంధన్ సందేశమని పేర్కొన్నారు. రక్షాబంధన్ కేవలం అన్నాచెల్లెళ్ల బంధానికే పరిమితం కాకుండా సమాజంలో పరస్పర గౌరవం, మానవత్వం, సోదరభావాన్ని బలోపేతం చేసే పవిత్రమైన పండుగగా నిలుస్తుందని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు. ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, ఐక్యత వెల్లివిరియాలని ఆకాంక్షించారు. బేతోలులో జరిగిన రాఖీ వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని పండుగను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యులు మహబూబ్ పాషా, గద్దపాటి సంతోష్, ఏడబోయిన సత్యం, అనపర్తి మదన్, ఏనుగంటి రామన్న, ఏనుగంటి వెంకన్న, ఎర్రం రమేష్, ఎర్రం వరుణ్, ఏర్పుల ప్రశాంత్, వెంకన్న, రాశాల వెంకటేష్, సంజనబోయిన మహేష్, చందనబోయిన శ్రీకాంత్, సిరికొండ శివకుమార్, భూక్య రాజేష్, సుదుగు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## 18 ఏళ్ల అంకితభావ సేవలకు ఘన వీడ్కోలు



- హోమ్‌గార్డ్ వరలక్ష్మిని సత్కరించిన అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్
- 190 మంది హోమ్‌గార్డ్స్‌కు ఖాకీ జాకెట్ల పంపిణీ

**రాజేంద్రనగర్, విశాల భారతి :**

ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో 18 ఏళ్ల పాటు అంకితభావంతో సేవలందించిన హోమ్‌గార్డ్ వరలక్ష్మికి ఘనంగా వీడ్కోలు పలికారు. అకాడమీ సెమినార్ హాల్‌లో అడ్మిన్ డిప్యూటీ డైరెక్టర్ కె.ఆర్.కె. ప్రసాద్, అడ్మిన్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ మహేష్ ఆధ్వర్యంలో పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి అకాడమీ డైరెక్టర్, డీజీపీ అభిలాష బిస్త్, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై వరలక్ష్మిని ఘనంగా సత్కరించి, ఆమె అందించిన సేవలను అభినందించారు. 35వ బ్యాచ్‌కు చెందిన వరలక్ష్మి గత 18 సంవత్సరాలుగా అకాడమీలోని వివిధ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తూ నిబద్ధతతో పని చేశారని ఆమె ప్రశంసించారు. తెలంగాణ పోలీస్ అకాడమీ దేశంలో అత్యుత్తమ శిక్షణా సంస్థగా గుర్తింపు పొందడంలో అధికారులు, శిక్షణార్థులతో పాటు సపోర్టింగ్ స్టాఫ్ అందిస్తున్న సహకారం, అంకితభావం కీలకమని అభిలాష బిస్త్ పేర్కొన్నారు. అకాడమీలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సుమారు 200 మంది హోమ్‌గార్డ్స్ నిరంతరం అందిస్తున్న సేవలను ఆమె ప్రత్యేకంగా కొనియాడారు. గత రెండు సంవత్సరాలుగా తన వద్ద ఎంతో అంకితభావంతో పనిచేసిన వరలక్ష్మి సేవలు, విధి నిర్వహణలో చూపిన నిబద్ధత ఇతరులకు ఆదర్శంగా నిలుస్తాయని డైరెక్టర్ పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం ఖాళీగా ఉండకుండా తనకు నచ్చిన పనిలో నిమగ్నమై ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ సంతోషంగా జీవించాలని ఆమె ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు కూడా ఆమె ఆరోగ్యం, సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. 190 మంది హోమ్‌గార్డ్స్‌కు జాకెట్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా అకాడమీలో విధులు నిర్వహిస్తున్న 190 మంది హోమ్‌గార్డ్స్‌కు అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, ఐపీఎస్ ఖాకీ రంగు జాకెట్లను పంపిణీ చేశారు. చలి, వర్షాకాలంలో విధులు నిర్వహించే హోమ్‌గార్డ్స్‌కు జాకెట్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఆమె తెలిపారు. జాకెట్లు అందుకున్న హోమ్‌గార్డ్స్ అకాడమీ డైరెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తమ సంక్షేమం పట్ల అకాడమీ యాజమాన్యం చూపుతున్న శ్రద్ధను అభినందించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ డి. మురళీధర్, ఐపీఎస్, అడ్మిన్ డిప్యూటీ డైరెక్టర్ కె.ఆర్.కె. ప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్లు వేమా శ్రీనివాసరెడ్డి, నరహరి, డీఎస్పీలు ఆదూరి శ్రీనివాసరావు, రామారావు, తిరుపతి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీరాజు, మహేష్, శ్రీను, రామకృష్ణ, ఫణి, ఔట్‌డోర్, ఇండోర్ ఫ్యాకల్టీ, అకాడమీ సిబ్బంది, హోమ్‌గార్డ్స్ పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జనాన్ని సజావుగా నిర్వహించాలి

**కమిషనర్ ఆదేశాలతో పోలీస్, హైడ్రా, మున్సిపల్ శాఖల సమన్వయ సమావేశం**



**రాజేంద్రనగర్, విశాల భారతి :**

నార్సింగి గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని సజావుగా, సురక్షితంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని నిర్ణయించారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదేశాల మేరకు నార్సింగి డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నార్సింగిలోని సర్కిల్ కార్యాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులతో పాటు ట్రాఫిక్ పోలీసులు, లా అండ్ ఆర్డర్ పోలీసులు, హైడ్రా అధికారులు, నార్సింగి సర్కిల్‌కు చెందిన వివిధ విభాగాల అధికారులు హాజరయ్యారు. గణేష్ విగ్రహాల నిమజ్జనం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టాల్సిన చర్యలపై అధికారులు విస్తృతంగా చర్చించారు. ప్రధానంగా నెక్నాంపూర్ బేబీ పాండ్, సంజీవరెడ్డి పాండ్, మంచిరేవుల, కొత్త చెరువు, కోకాపేట్, జన్వాడ చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలపై సమీక్షించారు. నిమజ్జన సమయంలో భారీగా తరలివచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. అదేవిధంగా నిమజ్జన ప్రాంతాల్లో అవసరమైన మౌలిక వసతులు, భద్రతా ఏర్పాట్లు, పారిశుద్ధ్య చర్యలను ముందుగానే పూర్తి చేయాలని అధికారులు సూచించారు. నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, క్రమబద్ధంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధుల సూచనలు, అభిప్రాయాలను అధికారులు స్వీకరించి, సాధ్యమైన మేరకు వాటిని ఏర్పాట్లలో పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు.

## మున్సిపల్ చైర్ పర్సన్ నివాసంలో రక్షాబంధన్ వేడుకలు

**విశాల భారతి, ఆర్మూర్:** అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ఉండే పవిత్రమైన ప్రేమానురాగాలకు, రక్షణకు ప్రతీక రక్షాబంధన్ అని ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్ గోనె లహరి రఘు అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని మున్సిపల్ చైర్ పర్సన్ తమ నివాసంలో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ గోనె లహరి రఘు, పట్టణ ప్రజలకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. రక్షాబంధన్ అనగా రక్షణ కల్పించే పవిత్రమైన ముడి అని అర్థం అని, మన పురాణాల్లో రక్షాబంధన్ కు గొప్ప చరిత్ర ఉందని పేర్కొన్నారు. శిశుపాలుడిని వధించే సమయంలో శ్రీకృష్ణుడి వేలికి గాయం కావడంతో ద్రౌపది వెంటనే తన చీర కొంగును చింపి కృష్ణుడి వేలికి కట్టింది. ఆ రక్షణ బంధానికి కృష్ణుడు సంతోషించి, ద్రౌపదికి ఎప్పుడూ అండగా ఉంటానని మాట ఇచ్చాడు. ఇలా ప్రత్యేకమైన చరిత్ర కలిగిన పండుగ రాఖీ పండుగ అని అన్నారు. పట్టణ ప్రజలు తమ కుటుంబ సభ్యులతో ఆనందోత్సవాల మధ్య రక్షాబంధన్ వేడుకలు జరుపుకోవాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గోనె దామోదర్, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఆడబిడ్డలందరికీ అన్నగా అండగా ఉంటా!


- ఆడబిడ్డల ఆనందమే అన్నయ్యకు నిజమైన ఆనందం
- రాఖీ పౌర్ణమి వేడుకల్లో మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** రాఖీ పౌర్ణమి సందర్భంగా ఎల్.బి.నగర్ నియోజకవర్గంలోని మన్సూరాబాద్ డివిజన్ కాస్మోపాలిటన్ కాలనీలో మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి నివాసంలో రాఖీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గం, డివిజన్‌కు చెందిన మహిళామణులు, అక్కాచెల్లెళ్లు పెద్ద సంఖ్యలో పాల్గొని కొప్పుల నర్సింహ్మా రెడ్డికి రాఖీలు కట్టి తమ ప్రేమాభిమానాలను చాటుకున్నారు. కుటుంబ సభ్యులతో పాటు బ్రహ్మకుమారి మహిళలు, మన్సూరాబాద్ డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు మంగారెడ్డి, రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యురాలు కవితారెడ్డి, వీరన్నగుట్ట ప్రాంతానికి చెందిన మహిళామణులు, వివిధ కాలనీల నుంచి వచ్చిన మహిళలు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కొప్పుల నర్సింహ్మా రెడ్డి మాట్లాడుతూ.. రాఖీ పౌర్ణమి సందర్భంగా అక్కాచెల్లెళ్ల ప్రేమాభిమానాలతో రాఖీలు కట్టడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఆడబిడ్డలందరికీ అన్నయ్యగా ఎల్లప్పుడూ అండగా ఉంటూ వారి భద్రత, సంతోషం కోసం తన వంతు బాధ్యతగా నిలబడతానని తెలిపారు. ఆడబిడ్డల ఆనందమే అన్నయ్యకు నిజమైన ఆనందమని అన్నారు. ప్రతి ఆడబిడ్డ సురక్షితంగా, సంతోషంగా ఉండేలా సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సాయిరామ్ గౌడ్, అమ్రేష్ ముదిరాజ్, పారంద సాయి, మహిళామణులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నార్సింగిలో ఘోర హిట్ అండ్ రన్.. డెలివరీ బాయ్ దుర్మరణం

- గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు స్పాట్‌డెడ్.. ఆపకుండా పరారైన వాహనం



**రాజేంద్రనగర్, విశాల భారతి :** నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఘోర హిట్ అండ్ రన్ ప్రమాదం చోటుచేసుకుంది. గోల్కొండకు చెందిన మహమ్మద్ అబ్దుల్ సయ్యద్ అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. సమద్ ఫస్ట్ క్లబ్‌లో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. డెలివరీ నిమిత్తం నార్సింగి నుంచి గండిపేట వైపు బైక్‌పై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం అతడి బైక్‌ను మితిమీరిన వేగంతో ఢీకొట్టినట్లు సమాచారం. ఢీకొన్న వాహనం ఆపకుండా అక్కడి నుంచి పరారైనట్లు తెలుస్తోంది. వాహనం ఢీకొట్టడంతో అదుపుతప్పిన సయ్యద్ బైక్‌తో సహా ఫుట్‌పాత్‌పై పడిపోయి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు స్థానికంగా ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు. పరారైన వాహనాన్ని గుర్తించి నిందితుడిని పట్టుకునేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు.

## పోలీసులకు రాఖీ కట్టి సోదరభావం చాటిన మహిళలు

- నాగోల్ పోలీస్ స్టేషన్‌లో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు




**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** రాఖీ పౌర్ణమి సందర్భంగా నాగోల్ పోలీస్ స్టేషన్‌లో ఆత్మీయ వాతావరణం నెలకొంది. రాఖీ పండుగను పురస్కరించుకుని మహిళా సోదరులు నాగోల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ మక్బుల్ జానీతో పాటు పోలీసు సబ్ఇన్‌స్పెక్టర్లు, సిబ్బందికి రాఖీలు కట్టి సోదరభావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మహిళా సోదరులు పోలీసు అధికారులకు రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందితో రాఖీ పండుగను జరుపుకోవడం ఆనందంగా ఉందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, రమేష్‌తో పాటు పోలీసు సిబ్బంది, మహిళా సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## మొయినాబాద్‌లో ఘనంగా రాఖీ వేడుకలు

- అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా రాఖీ పండుగ



**మొయినాబాద్ ఆగస్టు 28(విశాలభారతి):** అన్నాచెల్లెళ్ల ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను మొయినాబాద్ పట్టణంతో పాటు మండల పరిధిలో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే మహిళలు, చిన్నారులు తమ సోదరులకు రాఖీలు కట్టి, వారి ఆయురారోగ్యాలను ఆకాంక్షించారు. సోదరులు తమ అక్కాచెల్లెళ్లకు బహుమతులు అందించి ప్రేమాభిమానాలను చాటుకున్నారు. దీంతో ఇళ్లలో పండుగ సందడి నెలకొంది. రాఖీ పండుగ సందర్భంగా కుటుంబ సభ్యులు ఒకచోట చేరి ఆనందంగా వేడుకలు జరుపుకున్నారు. అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయతలను మరింత బలోపేతం చేసే పండుగగా రాఖీ నిలుస్తుందని పలువురు పేర్కొన్నారు.

## రాఖీ బంధం.. తరగని ఆత్మీయత!

- దండెం సోదరులకు రాఖీ కట్టిన సోదరి స్వరూపా రెడ్డి



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య అనుబంధం, ప్రేమానురాగాలకు ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి సందర్భంగా దండెం బ్రదర్స్‌కు ఆత్మీయంగా రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు వారి సోదరి నాతాల స్వరూపా రెడ్డి. దండెం నరసింహారెడ్డి, తాజా మాజీ కౌన్సిలర్ దండెం కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దండెం రాంరెడ్డిలకు స్వరూపా రెడ్డి రాఖీ కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమానురాగాలు, ఆత్మీయత వెల్లివిరిశాయి. అదేవిధంగా విదేశాల్లో ఉన్న వారి మరో సోదరి గుజ్జ మాధవి రెడ్డి ఫోన్ ద్వారా సోదరులకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. దూరంగా ఉన్నప్పటికీ కుటుంబ సభ్యుల మధ్య ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని ఫోన్ కాల్ ద్వారా పంచుకున్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా దండెం కుటుంబంలో ఆత్మీయ వాతావరణం నెలకొంది. అన్నాచెల్లెళ్ల అనుబంధం, ప్రేమానురాగాలు ఎల్లప్పుడూ ఇలాగే కొనసాగాలని కుటుంబ సభ్యులు ఆకాంక్షించారు.

## అక్కచెల్లెళ్ల ప్రేమాభిమానాలకు కృతజ్ఞతలు

- ఎల్లవేళలా తోడుగా ఉంటానన్న తోకల శ్రీనివాస్ రెడ్డి



**రాజేంద్రనగర్, విశాల భారతి :** రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని అక్కచెల్లెళ్లను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి ఆత్మీయంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు ఆయనకు రాఖీలు కట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అక్కచెల్లెళ్ల ప్రేమాభిమానాలకు శ్రీనివాస్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్కచెల్లెళ్లకు ఎల్లప్పుడూ అన్నగా అండగా, తోడుగా ఉంటానని భరోసా ఇచ్చారు. వారి సుఖసంతోషాలు, శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. రాఖీ పండుగ అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనుబంధానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రతి అక్కచెల్లెలి జీవితంలో రక్షాబంధన్ పండుగ ఆనందం, ఆరోగ్యం, సుఖసంతోషాలు నింపాలని ఆకాంక్షిస్తూ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉడుత లక్ష్మి, అంజమ్మ, జి. లక్ష్మి, పద్మ, లత, భాగ్యమ్మ, పూజ, అండాలు తదితరులు పాల్గొన్నారు.

DISTRICT news
WWW.VISHALABHARATI.COM
విశాల భారతి

## అన్నచెల్లెళ్ల అక్కతమ్ముళ్ల ఆత్మీయతకు ప్రతీక రక్షాబంధన్

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు**



**కూకట్ పల్లి విశాల భారతి:** రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని కూకట్‌పల్లి నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ కుటుంబ సభ్యులు నియోజకవర్గంలోని అక్కాచెల్లెళ్లందరూ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు గారి నివాసానికి చేరుకుని ఆయనకు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు సోదరీమణులందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేసి, అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పండుగ ప్రతి కుటుంబంలో ప్రేమ, ఆప్యాయత, సంతోషాలను నింపాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్కాచెల్లెళ్ల ఆశీర్వాదాలు, ఆప్యాయతలు తనకు ఎల్లప్పుడూ కొండంత బలాన్ని ఇస్తాయని, నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడంలో వారి సహకారం, ప్రోత్సాహం మరింత ఉత్సాహాన్ని అందిస్తాయని అన్నారు. రక్షాబంధన్ సందర్భంగా సోదరీమణులందరికీ అండగా ఉంటూ, వారి సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానని అన్నాచెల్లెళ్ల , అక్కతమ్ముళ్ల అనుబంధం చిరకాలం వర్ధిల్లాలని ప్రతి ఇంటా ఆనందం సుఖశాంతులు వెల్లివిరియాలనీ వడ్డేపల్లి రాజేశ్వరరావు కోరారు.

## బాధిత మహిళలకు అండగా నిలిచిన తీన్మార్ మల్లన్నకు రాఖీ కట్టిన హనుమాన్‌నగర్ మహిళలు



**రాజేంద్రనగర్, విశాల భారతి :** రాజేంద్రనగర్ తమ జీవితాల్లో అత్యంత క్లిష్ట పరిస్థితులు ఎదురైన సమయంలో సోదరుడిలా అండగా నిలిచి, తమ హక్కుల కోసం పోరాడిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు రాజేంద్రనగర్ హనుమాన్‌నగర్ బస్తీ మహిళలు రాఖీ కట్టి తమ ఆప్యాయతను, కృతజ్ఞతను చాటుకున్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా మల్లన్నను తమ సోదరుడిగా భావిస్తూ మహిళలు రాఖీలు కట్టి ఆశీర్వాదాలు తీసుకున్నారు. హనుమాన్‌నగర్ ప్రాంతంలో తమ ఇళ్లను అక్రమార్కులు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని బాధిత మహిళలు గతంలో తీన్మార్ మల్లన్న దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే స్పందించిన మల్లన్న సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాలకు అండగా నిలిచారు. వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాడుతానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. తమకు ఎవరూ తోడుగా నిలవని సమయంలో తీన్మార్ మల్లన్న సోదరుడిలా ముందుకొచ్చి ధైర్యం చెప్పారని తెలిపారు. తమ ఇళ్లను కాపాడుకునేందుకు, తమ హక్కుల కోసం ఆయన అండగా నిలిచారని పేర్కొన్నారు. అందుకే రాఖీ పండుగ సందర్భంగా ఆయనకు రాఖీ కట్టి తమ సోదరుడిగా భావిస్తున్నామని చెప్పారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటూ బాధితుల సమస్యలపై స్పందించే నాయకుడిగా తీన్మార్ మల్లన్నకు మహిళలు అభినందనలు తెలిపారు. సామాజిక న్యాయం కోసం ఆయన చేస్తున్న పోరాటానికి తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు.

## అన్నాచెల్లెళ్ల ఆత్మీయ అనుబంధానికి ప్రతీక రాఖీ పౌర్ణమి



**సికింద్రాబాద్, విశాల భారతి :** అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలు, ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మంద జగన్ కుటుంబ సభ్యులు సోదరీమణులు తమ సోదరులకు రాఖీలు కట్టి, వారి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. అనంతరం రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. పలు ప్రాంతాల్లో రాఖీ పండుగను పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంద జగన్ మాట్లాడుతూ..ప్రస్తుత వేగవంతమైన జీవనశైలిలో కుటుంబ సభ్యుల మధ్య అనుబంధాలు మరింత బలపడాల్సిన అవసరం ఉందని, అలాంటి బంధాలను గుర్తుచేసే పండుగగా రాఖీ పౌర్ణమి ప్రత్యేకతను సంతరించుకుందని పలువురు అభిప్రాయపడ్డారు. ప్రేమ, ఆప్యాయత, పరస్పర సహకారం, కుటుంబ విలువలను భావితరాలకు అందించడంలో ఇటువంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.

## పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలపై టిఆర్ఎస్వి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రికి పోస్టుకార్డుల ద్వారా వినతి



**సికింద్రాబాద్, విశాల భారతి :** రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆదేశాల మేరకు, బీ ఆర్ఎస్వి హైదరాబాద్ జిల్లా నాయకులు యాదా క్రాంతి నాయకత్వంలో పాలిటెక్నిక్ విద్యార్థులతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన G.O. No.97ను తక్షణమే రద్దు చేయాలని, డిమాండ్ చేస్తూ ఎస్ బి టెట్ వ్యవస్థను యథావిధిగా కొనసాగించాలని తెలంగాణ ముఖ్యమంత్రి, విద్యాశాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న ఏ. రేవంత్ రెడ్డికి పోస్టుకార్డుల ద్వారా వినతిని తెలియజేశారు. పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే G.O. No.97ను రద్దు చేయాలని, పాలిటెక్నిక్ విద్యకు ప్రత్యేక గుర్తింపు కల్పిస్తున్న ఎస్బిటిఈటి వ్యవస్థను కొనసాగించాలని బి ఆర్ ఎస్ వి డిమాండ్ చేసింది. డిప్లొమా విద్యార్థులకు ఉన్న ఈ సెట్ ,బీటెక్ లేటరల్ ఎంట్రీ, ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు ఎలాంటి ప్రతికూల ప్రభావానికి గురికాకుండా ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఇలాంటి కీలక నిర్ణయాలు తీసుకునే ముందు ప్రభుత్వం విద్యార్థులు, అధ్యాపకులు మరియు సాంకేతిక విద్యా నిపుణులతో సంప్రదింపులు జరపాలని బీ ఆర్ ఎస్ వి నాయకులు అన్నారు. “పాలిటెక్నిక్ విద్యను కాపాడాలి - ఎస్బి టెట్ను కొనసాగించాలి - డిప్లొమా విద్యార్థుల భవిష్యత్తును రక్షించాలి” అనే డిమాండ్‌తో విద్యార్థుల పక్షాన బి ఆర్ ఎస్ వి నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే విద్యార్థుల సమస్యలపై స్పందించి, G.O. No.97ను రద్దు చేసి ఎస్బి టెట్ను యథావిధిగా కొనసాగించాలని బీ ఆర్ఎస్వి తరపున హైదరాబాద్ జిల్లా నాయకులు యాద క్రాంతి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి విభాగం నాయకులు అభి ముదిరాజ్, కరణ్ నాయక్, పవన్, రిత్విక్ రెడ్డి, శశాంత్ రెడ్డి, కార్తీక్ యాదవ్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

## ఐక్యత, ఆధ్యాత్మికతకు ప్రతీకగా రాఖీ పౌర్ణమి వేడుకలు

**సికింద్రాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షులు - మంద జగన్**





**సికింద్రాబాద్, విశాల భారతి :** రాఖీ పర్వదినాన్ని పురస్కరించుకొని సికింద్రాబాద్ పద్మశాలి సంఘం అధ్యక్షులు మంద జగన్ అధ్వర్యంలో శుక్రవారం ఘనంగా పద్మశాలి సంఘం కార్యాలయంలో పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జాతీయ చేనేత అధ్యక్షులు డాక్టర్ చిక్క దేవదాసు పాల్గొన్నారు. అనంతరం 11 మంది తో కలిసి గాయత్రి, జంజర పూజ కార్యక్రమం నిర్వహించారు. మంద జగన్ భవాని, మంద ఈశ్వర్ రమ, మార్పెల్లి రవి సునిత, మంద మురళి భవాని, స్వర్గం బాబురావు స్వరూప, కర్నాటి వెంకటేష్ స్వరూప, వేముల శ్వేత రాజు, చింతకింది సుధాకర్ వాసుద, కరుణాకర్ లావణ్య, ఆమంచ మార్కండేయ రమ, తౌటం సతీష్ కావ్య, దిండిగల శ్రీకాంత్ సంగీత, అంకం శ్రీకాంత్, చింతకింది సాయి కిరణ్ .ఈ సందర్భంగా మంద జగన్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రజలందరికి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చింతకింది మల్లేష్, బొమ్మ నరేందర్, గోలి జనార్ధన్, వల్లపు కృష్ణమూర్తి, వోగ్గు శ్రీధర్, గబ్బేట రాజు, బొగ సంజీవ కుమార్, కర్నల్లి శ్రీకాంత్, తిరుమల రవి, తిరుమల సంతోష్, పులి శివకుమార్, శ్యామల శివకుమార్, ఆమంచ రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేపై అసత్య ప్రచారాలు మానుకోవాలి

- అభివృద్ధిని ఓర్వలేకే ప్రతిపక్షాల తప్పుడు ఆరోపణలు
- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ వీరన్న నాయక్
- కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు భూక్య గోపా నాయక్

**కురవి విశాల భారతి:**





డోర్నకల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధిని ఓర్వలేకే బీఆర్ఎస్, బీజేపీ నాయకులు అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ వీరన్న నాయక్ మండిపడ్డారు. వాస్తవాలను తెలుసుకోకుండా ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఆరోపణలు చేయడం సరికాదని ఆయన హితవు పలికారు. డోర్నకల్ నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు ముందుకు సాగుతున్నాయని వీరన్న నాయక్ తెలిపారు. మరిపెడలో కోర్టు ఏర్పాటు, రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వంద పడకల ఆసుపత్రి, ఇంటిగ్రేటెడ్ పాఠశాల వంటి కీలకమైన అభివృద్ధి కార్యక్రమాలు ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్ ప్రత్యేక చొరవతో ముందుకు సాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

**అక్రమ కార్యకలాపాలపై ఉక్కుపాదం**

నియోజకవర్గంలో ఇసుక మాఫియా, నల్లబెల్లం అక్రమ వ్యాపారం, గంజాయి తదితర అక్రమ కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని డాక్టర్ వీరన్న నాయక్ తెలిపారు. అక్రమాలకు అడ్డుకట్ట వేస్తూ ప్రజల ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వంపై విమర్శలు చేయడం ప్రతిపక్షాల రాజకీయ దురుద్దేశానికి నిదర్శనమని అన్నారు. గత పాలకుల హయాంలో జరగని స్థాయిలో ప్రస్తుతం అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలకు మేలు చేసే ప్రతి కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ఎమ్మెల్యే నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు.

**ప్రజల విశ్వాసానికి 54 వేల ఓట్ల మెజారిటీ నిదర్శనం.**

గత ఎన్నికల్లో సుమారు 54 వేల ఓట్ల మెజారిటీతో డాక్టర్ రామచంద్రనాయక్ విజయం సాధించడం ప్రజల్లో ఆయనకున్న విశ్వాసానికి నిదర్శనమని వీరన్న నాయక్ అన్నారు. ఎమ్మెల్యే ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు అందుబాటులో ఉంటూ, నియోజకవర్గ అభివృద్ధితో పాటు పార్టీ కార్యకర్తల సంక్షేమానికి కూడా ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. గతంలో ప్రతి మండలంలో దళారీ వ్యవస్థలకు ప్రాధాన్యతనిస్తూ, పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలను విస్మరించారని ఆయన విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే రామచంద్రనాయక్ కార్యకర్తలకు సముచిత గౌరవం, ప్రాధాన్యత కల్పిస్తూ ఎలాంటి అవకతవకలకు తావులేకుండా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తున్నారని అన్నారు.

**వాస్తవాలు తెలుసుకుని మాట్లాడండి**

ప్రతిపక్ష నాయకులు ఆరోపణలు చేసే ముందు వాస్తవాలను పరిశీలించాలని డాక్టర్ వీరన్న నాయక్ సూచించారు. రాజకీయ విమర్శల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించే అసత్య ప్రచారాలకు పాల్పడటం మానుకోవాలని హెచ్చరించారు. అభివృద్ధి పనులపై నిర్మాణాత్మక సూచనలు చేయాల్సింది పోయి నిరాధార ఆరోపణలు చేయడం ప్రజల మధ్య ప్రతిపక్షాల విశ్వసనీయతను దెబ్బతీస్తుందని అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు భూక్య గోపా నాయక్ మాట్లాడుతూ, డోర్నకల్ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్ చేస్తున్న కృషికి కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు అండగా నిలుస్తారని అన్నారు. నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు ఎమ్మెల్యేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

> రాజకీయాల్లో నాయకులు వస్తుంటారు, వెళ్తుంటారు. కొందరు పదవుల కోసం రాజకీయాలు చేస్తారు. మరికొందరు వ్యక్తిగత ప్రయోజనాల కోసం రాజకీయ వేదికలను ఉపయోగించుకుంటారు. కానీ అరుదుగా మాత్రమే కొందరు నాయకులు తమ వ్యక్తిగత జీవితాన్ని, సమయాన్ని, శక్తిని, ఆలోచనలను పూర్తిగా సమాజానికి, సామాజిక ఉద్యమానికి అంకితం చేస్తారు. అలాంటి నాయకత్వానికి ఉదాహరణే బీఎస్పీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రాం శేఖర్.

# తెలంగాణ బహుజన రాజకీయాలకు కొత్త దిశ ఇబ్రాం శేఖర్

బహుజన సమాజం రాజకీయంగా బలపడకపోతే సామాజిక న్యాయం అసంపూర్ణంగానే మిగిలిపోతుందని విశ్వసించే నాయకుడు ఆయన. తెలంగాణలో బహుజనులను కాపాడే శక్తి, రాజకీయ అధికారం దిశగా నడిపించే జ్ఞానం, లక్ష్యం నెరవేరే వరకు అలుపెరగని పోరాట స్ఫూర్తి, ఆటంకాలు ఎదురైనా వెనుదిరగని ఓపిక కలగలిపిన వ్యక్తిత్వం ఆయనది. అయితే ఆయనను ప్రత్యేకంగా నిలబెట్టేది కేవలం ఆయన రాజకీయ పదవి కాదు; ఆయన ఆలోచనా విధానమే. రాజకీయ గౌతమ బుద్ధుడు మన్యవార్ కాన్షీరాం పని విధానాన్ని, సంస్థాగత నిర్మాణ తత్వాన్ని, క్రమశిక్షణను ఒంటబట్టించుకుని ఉద్యమ రాజకీయాల్లో ముందుకు సాగుతున్న నాయకుడు ఇబ్రాం శేఖర్. పార్టీ అంటే వ్యక్తుల సమూహం కాదు, ఒక లక్ష్యం కోసం పనిచేసే క్రమశిక్షణ గల ఉద్యమ శక్తి అనే కాన్షీరాం సిద్ధాంతాన్ని తన రాజకీయ జీవితంలో ఆచరిస్తున్నారు. ప్రజాక్షేత్రంలో సాధారణ కార్యకర్త స్థాయి నుంచి ఎదిగి, సర్పంచ్‌గా, కౌన్సిలర్‌గా, కార్పొరేటర్‌గా, అనంతరం ఒక మున్సిపాలిటీకి డిప్యూటీ మేయర్‌గా పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. ఈ పదవులు ఆయనకు కేవలం రాజకీయ గుర్తింపు మాత్రమే ఇవ్వలేదు; ప్రజల సమస్యలను దగ్గరగా అర్థం చేసుకునే అవకాశాన్ని కల్పించాయి. బహుజన రాజకీయాలకు, మహనీయుల ఆశయాలకు ప్రతిరూపంగా వివిధ ప్రజాప్రతినిధి బాధ్యతలను నిర్వహించి తన నాయకత్వ సామర్థ్యాన్ని నిరూపించుకున్న ‘ప్రూవ్డ్ లీడర్’గా గుర్తింపు పొందారు. ఇబ్రాం శేఖర్ రాజకీయ జీవితంలో మరో విశేషం ఏమిటంటే, చిన్నతనం నుంచే తనకు మార్గదర్శకుడిగా నిలిచిన తన అన్న ఇబ్రాం మైసన్న చూపిన దారిలో ఆయన ప్రయాణం సాగింది. కుటుంబం నుంచే ఉద్యమ చైతన్యం, సామాజిక బాధ్యత, బహుజన భావజాలం నేర్చుకున్న ఆయన, ఆ విలువలను తన రాజకీయ జీవితానికి పునాదిగా మార్చుకున్నారు. అందుకే నేడు ఆయనకు రాజకీయాలు వ్యక్తిగత ఎదుగుదలకు మార్గం కాదు; కాన్షీరాం ఆశయాలను సాకారం చేయడానికి ఒక సాధనం. బహుజన్ సమాజ్ పార్టీ అనేది కేవలం ఒక రాజకీయ పార్టీ కాదని, అది కోట్లాది అణగారిన వర్గాల ఆత్మగౌరవ ఉద్యమమని ఆయన బలంగా నమ్ముతారు. అందుకే పార్టీని ఎన్నికల కోణంలో మాత్రమే కాకుండా, సామాజిక మార్పుకు వేదికగా ఆయన చూస్తున్నారు. గ్రామ స్థాయి కార్యకర్త నుంచి రాష్ట్ర స్థాయి నాయకుడి వరకు ప్రతి ఒక్కరిలో ఉద్యమ చైతన్యాన్ని నింపేందుకు నిరంతరం కృషి చేస్తున్నారు. కాన్షీరాం చెప్పిన "రాజకీయ అధికారం అన్ని సమస్యలకు పరిష్కారం" అనే సిద్ధాంతాన్ని తెలంగాణ ప్రజల మధ్య బలంగా తీసుకెళ్లాలనే సంకల్పంతో ఆయన




పనిచేస్తున్నారు. బహుజన సమాజం తన ఓటు శక్తిని గుర్తించి, తన రాజకీయ భవిష్యత్తును తానే నిర్ణయించుకునే స్థాయికి చేరుకోవాలని ఆయన కోరుకుంటున్నారు. ఆ దిశగా పార్టీ నిర్మాణం, సామాజిక చైతన్యం, యువతలో రాజకీయ అవగాహన, బూత్ స్థాయి బలోపేతం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. కాన్షీరాం జీవిత చరిత్రకు సంబంధించి వేలాది పుస్తకాలను పంపిణీ చేశారు. తెలంగాణలో బహుజన రాజకీయాలు ఇంకా సంపూర్ణ శక్తిగా ఎదగాల్సిన అవసరం ఉందని ఆయన తరచుగా చెబుతుంటారు. అధికార రాజకీయాల్లో బహుజనుల సంఖ్య ఎక్కువైనా, నిర్ణయాధికారం మాత్రం పరిమిత వర్గాల చేతుల్లోనే ఉందనే వాస్తవాన్ని ఎత్తి చూపుతారు. ఈ పరిస్థితిని మార్చడానికి బహుజన్ సమాజ్ పార్టీనే ప్రత్యామ్నాయ శక్తిగా తీర్చిదిద్దాలని ఆయన సంకల్పించారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ విస్తరణ, కొత్త నాయకత్వ తయారీ, యువతను ఉద్యమంలోకి తీసుకురావడం, సామాజిక సమస్యలపై నిరంతర పోరాటం చేయడం వంటి అంశాల్లో ఆయన చూపుతున్న చొరవ కార్యకర్తలకు స్ఫూర్తినిస్తోంది. పార్టీ బలపడితేనే బహుజనుల స్వరం బలపడుతుందని, బహుజనుల స్వరం బలపడితేనే రాజకీయ అధికారం సాధ్యమవుతుందని ఆయన నమ్మకం. తెలంగాణలో ఇబ్రాం శేఖర్ నాయకత్వంలో బహుజన్ సమాజ్ పార్టీకి ఒక నూతన జవసత్వం సంతరించుకుందనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది. గత కొంతకాలంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న వరుస సభలు, సమీక్షా సమావేశాలు, ఉద్యమ కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై చేపడుతున్న ప్రభావశీల కార్యాచరణ పార్టీని మళ్లీ ప్రజల చర్చల్లోకి తీసుకువచ్చాయి. బెహెన్ కుమారి మాయావతి ఆశీస్సులతో ఇబ్రాం శేఖర్ రాష్ట్ర అధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టి ఏడాది కాలం పూర్తయ్యింది. ఆయన పదవీ బాధ్యతలు చేపట్టిన క్షణం నుంచి నేటి వరకు పార్టీని గ్రామగ్రామాన తీసుకెళ్లేందుకు తనవంతుగా కృషి చేస్తున్నారు. బహుజన ప్రజలను బీఎస్పీ గొడుగు కిందకు చేర్చే పనిని వేగవంతం చేశారు. పార్టీ చీఫ్ సెక్టార్ కో ఆర్డినేటర్లు ఆథర్ సింగ్, సురేష్ ఆర్యల సహకారం, ప్రోత్సాహం, మార్గదర్శనంలో పార్టీని రాష్ట్రంలో బలోపేతం చేస్తున్నారు. ఇబ్రాం శేఖర్ పార్టీ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించాక చేసిన మొదటి పని... స్థానిక సంస్థలు అంటే ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పోటీ చేసేందుకు బీఎస్పీ ఎన్నికల గుర్తు ఏనుగును సాధించడం. చాలాకాలంగా స్థానిక సంస్థల్లో ఏనుగు గుర్తు లేకపోవడంతో పార్టీ అభ్యర్థులుగా పోటీ చేయడంలో ఇబ్బందులుండేవి, ఇండిపెండెంట్లుగా పోటీ చేయడంతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. దీని వల్ల పార్టీకీ, అభ్యర్థులకు ఇబ్బందులు ఎదురయ్యేవి. ఇబ్రాం శేఖర్ పార్టీ తెలంగాణ ప్రెసిడెంట్ అయిన వెంటనే రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద ఏనుగు గుర్తును రిజిస్టర్ చేయించి స్థానిక సంస్థల్లో ఏనుగు గుర్తుతో పోటీ చేసేందుకు రూట్ క్లియర్ చేయించారు. ఇది ప్రెసిడెంట్ గా శేఖర్ సాధించిన తొలి విజయం మాత్రమే కాదు పార్టీ శ్రేణులకు కొండంత అండనిచ్చింది. అటు గ్రామగ్రామాన ఏనుగు గుర్తును తీసుకెళ్లేందుకు కమిటీల నిర్మాణంపై దృష్టి సారించారు. దీంతో సెక్టార్ కమిటీలు, బూత్ కమిటీలతో మండలాలు, గ్రామాల్లో పార్టీ నిర్మాణం స్పీడందుకుంది. తనకు రాజకీయాల్లో రెండు దశబ్దాలకు పైబడ్డ అనుభవంతో ఏ నలుగురు గుమికూడినా కాన్షీరాం పని విధానం, బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాధించిపెట్టిన ఓటు విలువను బోధిస్తూ బీఎస్పీలో చేరేలా సిద్ధాంతాన్ని బోధిస్తున్నారు. స్థానిక సంస్థల్లో బీఎస్పీ అభ్యర్థులు పోటీ చేశారు. చెప్పుకోదగ్గ ఓట్లు దక్కాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల్లో సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు మెంబర్లను గెలుచుకోవడం జరిగింది. కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ సొంత సింబల్ మీద ఇద్దరు కార్పొరేటర్లను గెలిపించుకున్నాం. వీటితోపాటు ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తున్నారు. సమస్య ఎక్కడున్నా స్పందించేందుకు క్యాడర్ ను సంసిద్ధులను చేశారు. జనాభా ప్రాతిపదికన బిసి వర్గాలకు పదవుల్లోనూ, స్థానిక ఎన్నికల టికెట్లలోనూ సమన్యాయం అందిస్తున్నాం. రాబోయే ఎన్నికల్లోనూ ఇదే దామాషా పద్ధతి అమలు చేసేలా పార్టీని సమాయత్తం చేస్తున్నారు. నేడు తెలంగాణలో బహుజన ఉద్యమం గురించి మాట్లాడినప్పుడు ఇబ్రాం శేఖర్ పేరు ప్రస్తావనకు రావడం యాదృచ్ఛికం కాదు. అది ఆయన అంకితభావానికి, క్రమశిక్షణకు, ఉద్యమ నిబద్ధతకు నిదర్శనం. వ్యక్తిగత లాభనష్టాల కంటే ఉద్యమ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతున్న ఆయన, తెలంగాణలో “బహుజన రాజకీయాలకు ఒక కొత్త ఆశ”గా కనిపిస్తున్నారు. ఇంటింటికి ఏనుగు, గడపగడపకు బీఎస్పీని తీసుకెళ్తూ తెలంగాణలో బహుజన రాజ్యాన్ని స్థాపించేందుకు సైనికుడిలా సాగుతున్న ఇబ్రాం శేఖర్ కు హార్ధిక శుభాకాంక్షలు.

**(ఇబ్రాం శేఖర్ బీఎస్పీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గా పదవీ బాధ్యతలు చేపట్టి (28ఆగస్టు'2025) ఏడాది పూర్తి అయిన సందర్భంగా.,)**



శ్రీనివాస్ సొంటె, అధ్యక్షులు బీఎస్పీ
సికింద్రాబాద్ జిల్లా, Cell:6303553684

# అమెరికాలో నిఖిత హత్య కేసులో కీలక మలుపు

**ఆగ్రాలో నిందితుడు అర్జున్ శర్మ అరెస్టు..**
**అమెరికాకు అప్పగింతకు ప్రక్రియ**

**విశాలభారతి, న్యూఢిల్లీ**

అమెరికాలోని మేరీల్యాండ్‌లో హైదరాబాద్‌కు చెందిన నిఖిత గోదిశాల (27) హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న అర్జున్ శర్మ (27) ను తెలంగాణ పోలీసులు ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో అరెస్టు చేశారు. ఆగస్టు 24న అతడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు అనంతరం ఢిల్లీలోని పాటియాలా హౌస్ కోర్టులో హాజరుపరిచారు. అమెరికా అధికారులు కోరుతున్న నేపథ్యంలో అర్జున్‌ను అప్పగించే ప్రక్రియ కొనసాగుతోంది.

**అమెరికాలో హత్య.. భారత్‌కు పరారీ**

హైదరాబాద్‌కు చెందిన 27 ఏళ్ల నిఖిత గోదిశాల అమెరికాలోని మేరీల్యాండ్ రాష్ట్రం ఎల్లికాట్ సిటీలో నివసిస్తూ ఉద్యోగం చేస్తున్నారు. 2025 డిసెంబర్ 31న ఆమె అదృశ్యమయ్యారు. జనవరి 2న ఆమె కనిపించడం లేదంటూ ఫిర్యాదు అందడంతో హోవర్డ్ కౌంటీ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అనంతరం మేరీల్యాండ్‌లోని కొలంబియాలో ఉన్న అర్జున్ శర్మ అపార్ట్‌మెంట్‌లో నిఖిత మృతదేహాన్ని గుర్తించారు. ఈ కేసులో అర్జున్‌పై అమెరికా పోలీసులు ఫస్ట్ డిగ్రీ, సెకండ్ డిగ్రీ హత్య ఆరోపణలతో అరెస్టు వారెంట్ జారీ చేశారు. అయితే అప్పటికే అతడు అమెరికా నుంచి భారత్‌కు వచ్చేసినట్లు దర్యాప్తులో తేలింది.

**ఆర్థిక లావాదేవీలపై వివాదం**

నిఖిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు ప్రకారం.. అర్జున్‌కు, నిఖితకు మధ్య ఆర్థిక లావాదేవీలకు సంబంధించి వివాదాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. డబ్బులు తీసుకుని తిరిగి చెల్లించలేదంటూ నిఖిత తండ్రి హైదరాబాద్‌లో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అర్జున్‌పై మోసం కేసు నమోదైంది. అమెరికా అధికారుల దర్యాప్తు ప్రకారం కూడా ఆర్థిక వివాదం హత్యకు కారణమై ఉండొచ్చన్న కోణంలో దర్యాప్తు సాగింది. అయితే హత్యకు సంబంధించిన తుది కారణాలు, ఆరోపణలపై నిర్ణయం కోర్టు విచారణలోనే తేలాల్సి ఉంది. తెలంగాణలో నమోదైన కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు అర్జున్ ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు.



## ట్రోలర్స్‌కి మరోసారి కౌంటరిచ్చిన కృతి సనన్

రాఖీ పర్వదినం సందర్భంగా ప్రముఖ బాలీవుడ్ నటి కృతి సనన్ నటించిన ఓ ఆభరణాల ప్రకటన సోషల్ మీడియాలో ఇటీవల తీవ్ర వివాదానికి దారితీసిన సంగతి తెలిసిందే. ఆ యాడ్‌లో కృతి ధరించిన దుస్తులు, అలాగే పెంపుడు కుక్కకు రాఖీ కట్టడంపై కొందరు నెటిజన్లు తీవ్ర విమర్శలు గుప్పించారు. అయితే ఈ ట్రోలింగ్‌పై కృతి సనన్ తాజాగా సోషల్ మీడియా వేదికగా మరోసారి గట్టి కౌంటర్ ఇచ్చారు.తన సోదరి నపుర్ సనన్‌తో కలిసి రాఖీ పండుగను జరుపుకున్న ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్న కృతి ఒక పోస్ట్ పెట్టింది. ఈ ఫొటోలో ఇద్దరి చేతులు మాత్రమే కనిపిస్తుండగా, ఇద్దరూ ఒకరికొకరు రాఖీలు కట్టుకుని ఉన్నారు. (రాఖీ ఫ్యాషన్ కమిటీ ఇంకా సమావేశంలోనే ఉన్నట్లుంది.. కానీ మేం మాత్రం అసలైన విషయాలపైనే దృష్టి పెట్టాం అంటూ) ఆమె రాసుకొచ్చారు. ఈ పోస్టు ద్వారా తన దుస్తులను విమర్శించిన వారికి ఆమె పరోక్షంగా చురకలంటించారు. అంతకుముందు కూడా మహిళల దుస్తుల ఆధారంగా వారి సంస్కృతిని, సంప్రదాయాలను జడ్జ్ చేయడంపై కృతి తీవ్రంగా స్పందించారు. పండుగలలో ముఖ్యం భావోద్వేగాలే తప్ప దుస్తులు కాదని ఆమె స్పష్టం చేశారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.